# ఇస్లాంలో మహిళలు

276

**Women in Islam**
**(Telugu)**

# ఇస్లామ్‌లో
# మహిళలు

మూలం

బి. ఆయెషా లెము

ఫాతిమా హీరెన్

అనువాదం

పద్మశ్రీ

ప్రకాశకులు:

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**

సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్,

హైదరాబాద్-2. ఫోన్:040-24564583

# Islamlo Mahilalu

**Women in Islam (Telugu)**


**TIP Series No.** : **276**

Written by : B.Ayesha lemu
Fathima Heeren

Translated by : Padmasri



*All Rights Reserved with Publishers*



2nd Edition : March 2017

Copies : 1000

**Price** : **Rs.35**

ISBN : 978-93-81111-25-3

Published by : **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

# విషయసూచిక

| | | |
|---|---|---|
| ముందుమాట | ... | 4 |
| తొలిపలుకు | ... | 6 |
| ఇస్లామ్‌లో మహిళలు | ... | 9 |
| ఆధ్యాత్మిక రంగంలో మహిళల స్థానం | ... | 11 |
| మేధోపరంగా స్త్రీహెూదా | ... | 12 |
| స్త్రీ పురుష సంబంధాలు | ... | 14 |
| హక్కులు.. బాధ్యతలు | ... | 16 |
| ఇస్లాంలో వివాహం | ... | 19 |
| విడాకులు | ... | 22 |
| వారసత్వపు హక్కు | ... | 24 |
| తల్లిగా స్త్రీపాత్ర | ... | 25 |
| వస్త్రధారణ | ... | 29 |
| బహుభార్యాత్వం | ... | 32 |
| ఇస్లాంలో కుటుంబ జీవనం | ... | 38 |
| ఇస్లామీయ విధానం | ... | 39 |
| ముస్లిం కుటుంబ నిర్మాణం | ... | 42 |
| నాలుగో స్తంభం: ఆశ్రయం | ... | 43 |
| ఇస్లామిక్ బాధ్యతలు | ... | 46 |
| వ్యక్తి ఆకాంక్షల రక్షణకు కుటుంబం | ... | 49 |
| కుటుంబం– వ్యక్తిత్వ నిర్మాణం | ... | 53 |
| కుటుంబం ఒక ఆశ్రయం | ... | 54 |
| వారసత్వం | ... | 58 |
| వస్త్రధారణ | ... | 63 |

# ముందుమాట

ఇస్లామ్ గురించి పాశ్చాత్య ప్రపంచానికి 13 దశాబ్దాలుగా తెలుసు. కానీ దాన్ని వారు ఒక శత్రువుగానో, పొంచివున్న ఒక ప్రమాదంగానో మాత్రమే భావించారు. మన మతాన్ని ద్వేషపూరితంగా, హింసాత్మకంగా, విగ్రహారాధనకు అంకితమైనదిగా ఇతరులు పేర్కొనడం వల్ల, మన సంస్కృతి గురించి తప్పుగా ప్రచారం చేయడం వల్ల ఇలాంటి అభిప్రాయాలు ఏర్పడి వుంటాయి. ఈ పరిస్థితిని ఇలాగే కొనసాగించలేం. ఇలాంటి పరిస్థితి వల్ల పాశ్చాత్య ప్రపంచానికి, ఇస్లామ్‌కి మధ్య సంబంధాలు నాశనమవుతున్నాయి. విజ్ఞానం పరిధులు విస్తరిస్తున్న నేపథ్యంలో, మేధోపరంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా, ఆర్థికంగా... యూరోప్‌కి, ముస్లిం ప్రపంచానికి మధ్య సంబంధం పెరుగుతున్న సమయంలో ఈ పాత, అవాస్తవిక దృక్పథాలు మారతాయని ఆశిద్దాం. వాస్తవాల ఆధారంగా, అవగాహన పెంపొందుతుందని, నచ్చిన, నచ్చని అంశాలను ఉన్నదున్నట్లుగా నిజాయతీగా అంగీకరిస్తారని, గౌరవిస్తారని ఆశిద్దాం.

1976 ఏప్రిల్ 3 నుంచి 12 వరకు లండన్‌లో అంతర్జాతీయ ఇస్లామిక్ కాన్ఫరెన్స్ జరిగింది. యూరోపు చరిత్రలో అంతకు ముందెప్పుడూ అంత పెద్ద స్థాయిలో ఇస్లామిక్ సదస్సు జరగలేదు. ఇస్లాం బోధనలను ప్రపంచానికి విన్పించడానికి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ముస్లిం మేధావులు, విద్యావంతులు, స్టేట్స్‌మన్ ఒక వేదికమీదికి వచ్చారు. ఇస్లాం గురించి, ముస్లిం సంస్కృతి గురించి పాశ్చాత్య సమాజానికి అవగాహన కల్పించడం, ముస్లింలకు, ఇతర ధర్మాలను ఆచరించేవారికి మధ్య సత్సంబంధాలు అభివృద్ధిపరచడం... ఈ సదస్సు నిర్వహణ ముఖ్యోద్దేశాలు.

ఆ సదస్సులో అన్నిటికన్నా ఆసక్తికరంగా సాగిన, గుర్తుండిపోయిన

విభాగాలు ఇస్లాంలో మహిళల గురించి చర్చించినవి. ఆ విభాగాల్లో ఇద్దరు ముస్లిం మహిళలు ప్రసంగించారు. ఇద్దరూ పాశ్చాత్య నేపథ్యం నుంచి వచ్చినవారే. ఒకరు ఇంగ్లిష్ వనిత కాగా మరొకరు జర్మన్ మహిళ. వేర్వేరు నేపథ్యాలనుంచి వచ్చినా వీరిద్దరూ ఇస్లామిక్ సమాజ నిర్మాణాన్ని స్వీకరించారు. తమ అనుభవాలను పంచుకోవడానికి అంగీకరించారు. దాంతో పాశ్చాత్య శ్రోతలకు వీరి నోటివెంట ఇస్లామ్ గురించి తెలుసుకునే అవకాశం కలిగింది. మొత్తం సదస్సుకు సంబంధించిన విశేషాలన్నీ బృహత్ గ్రంథంగా వెలువడక ముందే వారిద్దరి ఈ ఉపన్యాసాలు ప్రత్యేక పుస్తకరూపంలో రావడం సంతో షంగా ఉంది. ఇంత త్వరగా, సమర్థంగా ఈ పుస్తకం రూపొందిస్తున్నందుకు ఇస్లామిక్ ఫౌండేషన్‌కి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

ఇస్లామిక్ కౌన్సిల్ ఆఫ్ యూరోప్
లండన్
23 జూన్, 1976

**సలీం అజ్జామ్**
సెక్రెటరీ జనరల్

# తొలిపలుకు

ప్రస్తుత మన సమాజం నిరంతరం మార్పులకు లోనవుతోంది. ఆందోళనలు నిత్యకృత్యమయ్యాయి. ఉన్న పరిస్థితుల పట్ల సందేహాలు, అసంతృప్తి, ఎదురు తిరగమని ప్రేరేపించడం... ఈ కాలానికి ప్రతీకలుగా మారాయి. తరతరాల నాటి వ్యవస్థలు అదృశ్యమయ్యే పరిస్థితి నెలకొంటోంది. గతంలో మనిషికి స్ఫూర్తినిచ్చి ముందుకు నడిపించిన విలువలు ఇప్పుడు తృణీకరించక పోయినా, ప్రశ్నించబడుతున్నాయి. అంతా ఒకలాంటి అయోమయంలో ఉన్నట్లుగా ఉంది.

ఆత్మ పరిశీలన, పున:పరీక్షలనే పద్ధతుల్లో తప్పు లేదు. అవి గతంలో ప్రగతికి ప్రధానాధారాలుగా ఉండేవి, భవిష్యత్తులోనూ ఉంటాయి. మనిషి సంయమనం, సమతౌల్యం కోల్పోతే పరిస్థితి మారిపోతుంది. ఇలాంటి పరిస్థితులు ఎదురైతేనే మనిషి మళ్లీ మళ్లీ... మరింత ఉన్నత ప్రమాణాలతో తన విలువలను మూల్యాంకనం చేసుకుంటూ వెళ్తాడు. అలాంటి పరిస్థితులే భవిష్య ప్రగతికి దూతలవుతాయి. అలా కాకుండా నకారాత్మక దృక్పథాన్ని అలవరచుకుంటే నైతిక, సాంస్కృతిక విధ్వంసానికి దారితీస్తాయి.

మార్పు అనేది మంచికీ జరగవచ్చు, చెడుకీ జరగవచ్చు. మార్పు కన్నా ముఖ్యం మార్పు చోటుచేసుకుంటున్న దిశ. మంచీ చెడుల పట్ల, సత్యం, అసత్యం పట్ల, న్యాయం, అన్యాయం పట్ల, నమ్మిన విషయంలో మంచి, సత్యం, న్యాయం పట్ల నిబద్ధత... ఇవి ముఖ్యం. మనం విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్న కాలంలో ఉన్నామన్నది నిస్సందేహం. ఆ మార్పు... మంచి, సత్యం, న్యాయం దిశగా జరుగుతోందనడానికి చాలా తక్కువ నిదర్శనలు కన్పిస్తున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో మార్పుపై కాక మార్పు దేనికోసం అన్నదానిపై దృష్టిపెట్టడం ముఖ్యం. మనసుల్ని ఆదర్శాలు, విలువలు, సిద్ధాంతాలపై కేంద్రీకరిస్తే మనిషికి భవిష్యత్తుపట్ల దూరదృష్టి ఏర్పడుతుంది. సూక్ష్మ విషయాలపై కాక ప్రాథమిక అంశాలను, మార్గాన్ని కాక గమ్యాన్ని, సాధనాలను కాక ఆశయాలను దృష్టిలో పెట్టుకోవాలి. ఆధునిక యుగంలో మనిషి ముందున్న సవాలు ఇది.

మనిషి జీవితంలోని భౌతిక అంశాలపై ఇస్లామ్‌కు అవగాహన ఉంది. ఇది కేవలం ఆత్మకు సంబంధించిన మతం కాదు. మనిషి జీవితమంతా ధార్మిక పరిధిలోకి తీసుకురావడమే ఇస్లాం ప్రత్యేకత. ఆత్మశుద్ధి, సృష్టికర్తతో మనిషి మమేకం కావడం లాంటివే కాక భౌతిక జీవన సమస్యలు, సమాజానికి సంబంధించిన సాంకేతిక అంశాలు కూడా ఈ మతం పట్టించుకుంటుంది. ఒకదానితో మరొకదానికి సంబంధం లేకుండా ఒకే అంశాన్ని విడిగా, ఒక సమస్యగా ఇస్లాం చూడదు. అన్నింటినీ కలిపి సమగ్రమైన దృక్పథంతో చూస్తుంది. ఈ సృష్టిలో మనిషి ప్రశాంతంగా తనతో తాను, పరమాత్మతో తాను... హాయిగా గడిపేందుకు వీలైన కొత్త ప్రపంచాన్ని సృష్టించడానికి అవసరమైన వనరులన్నీ మనిషికి అందుబాటులో ఉంచాలన్నది ఇస్లాం కోరిక. కానీ ఆధునిక సమాజంలో అదే కొరవడుతోంది.

మానవ సమాజంలో కుటుంబం ఒక ముఖ్యమైన వ్యవస్థ. పైన పేర్కొన్న ప్రశాంతత మనిషిలో లేనప్పుడు దాని ప్రభావం అతనికి ఇతరులతో ఉన్న సంబంధాలపై పడుతుంది. ముఖ్యంగా కుటుంబంలోని ఇతర వ్యక్తులమీద... భార్య మీద పడుతుంది. ఈ కాలపు కీలక సమస్యలపై, మానవ సమాజపు భవిష్యత్తు గురించి ఎలాంటి చర్చ జరిగినా అది స్త్రీపురుషుల సంబంధం చుట్టూ, కుటుంబం, విద్య అనే వ్యవస్థల చుట్టూ తిరుగుతోంది.

ఇస్లామిక్ కౌన్సిల్ ఆఫ్ యూరోప్, కింగ్ అబ్దుల్ అజీజ్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 1976లో లండన్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఇస్లామిక్ కాన్ఫరెన్స్ 'ఇస్లాం అండ్ ద ఛాలెంజ్ ఆఫ్ అవర్ ఏజ్' (ఇస్లాం మరియు నేటి

కాలంలో మనముందున్న సవాలు) అన్న అంశం మీదే ప్రధానంగా సాగింది. ఏప్రిల్ 8న జరిగిన ఒక ప్రత్యేక సదస్సు అయితే పూర్తిగా ఇస్లామిక్ దృక్పథంలో స్త్రీ పురుషుల సంబంధాలను విశ్లేషించింది. ఈ అంశంపై ప్రసంగించిన ఇద్దరు యూరోపునకు చెందిన ముస్లిం మహిళలు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఇంటర్నేషనల్ ఇస్లామిక్ కాన్ఫరెన్స్‌లో చర్చించిన అన్ని అంశాలను సమగ్రంగా ముద్రించడం జరుగుతోంది. అయితే వేర్వేరు వర్గాల నుంచి వస్తున్న ఒత్తిడి నేపథ్యంలో ఈ రెండు ఉపన్యాసాలతో పాటు అనంతరం జరిగిన చర్చలో కొంతభాగాన్ని 'ఉమన్ ఇన్ ఇస్లాం' పేరుతో ప్రత్యేక పుస్తకంగా ప్రచురిస్తున్నాం.

రాతప్రతిని పుస్తకరూపంలో తెచ్చే క్రమంలో మేమే సంపాదకులుగా వ్యవహరించాం. ఖుర్ఆన్ వాక్యాలకు సంబంధించిన అనువాదం ఇస్లామిక్ ఫౌండేషన్‌లో జరిగిన పని ఆధారంగా పూర్తి చేశాం. ఇండోనేషియన్, అరబిక్ భాషల్లోనూ ఈ పుస్తకం ప్రచురితమవుతోంది. ఇండోనేషియన్ భాషలో డాక్టర్ ఎం. నట్సీర్, అరబిక్ భాషలో డాక్టర్ ముహమ్మద్ సక్ర్ పర్యవేక్షిస్తున్నారు.

ఇస్లామిక్ కౌన్సిల్ ఆఫ్ యూరోప్ తరఫున సదస్సు చర్చించిన అంశాలను ప్రచురించే క్రమంలో సంపాదకత్వ బాధ్యతలు చేపట్టడానికి నన్ను ఆహ్వానించినందుకు ఇస్లామిక్ కౌన్సిల్ ఆఫ్ యూరోప్ సెక్రెటరీ జనరల్ సోదరుడు సలీం అజ్జామ్‌కు నా ధన్యవాదాలు. రాతప్రతిని చదివిన మిస్టర్ ఇ. ఫాక్స్‌కు కూడా నా ధన్యవాదాలు. డాక్టర్ ఎం.ఎం. ఎహసాన్, మిస్టర్ అష్రఫ్ అబూ తురాబ్‌లు తొలి కాపీ చదివి విలువైన సూచనలిచ్చి నాకు సహాయం చేశారు. కార్యదర్శిగా శ్రీమతి కె. హెూలింగ్‌వర్త్ అందించిన సహాయం నిరుపమానమైనది.

**ఖుర్షిద్ అహ్మద్**
డైరెక్టర్ జనరల్

ద ఇస్లామిక్ ఫౌండేషన్
17 జమాదివుస్సాని 1396
15 జూన్ 1976

# ఇస్లామ్‌లో మహిళలు

పదిహేనేళ్ల క్రితం నేను ఇస్లాం మతం స్వీకరించినప్పటినుంచి ముస్లిమేతర మిత్రుల నుంచి నాకు రకరకాల ప్రశ్నలు ఎదురయ్యేవి. ముఖ్యంగా ఇస్లామ్ జీవన విధానం గురించి స్నేహితులు, పరిచయస్తులు తరచూ ప్రశ్నించే వారు. సాధారణ విద్యావంతులైన పాశ్చాత్యులకు ఇస్లాం గురించి ఏమాత్రం తెలియదని వారి ప్రశ్నలను బట్టి నాకర్థమైంది. మరో ముఖ్యమైన విషయ మేంటంటే ఇస్లాంలో మహిళల పాత్ర గురించి పలు అపోహలు అపార్థా లున్నాయి. ముస్లిమేతర స్నేహితులు కొందరు నన్ను అడిగిన ప్రశ్న లు ఇలా సాగేవి...

'ఇస్లాంలో మహిళలకు ఆత్మ ఉంటుందని నమ్ముతారా?',

'ముస్లిం మహిళలు దేవుడిని ప్రార్థించరు, మక్కా వెళ్లరు కదూ?',

'స్వర్గం అనేది ఇస్లాంలో పురుషులకు మాత్రమే కదా?'.

ఇలాంటి ఊహలు, అపోహలను బట్టి చూస్తే ముస్లిం మహిళకు ఆధ్యాత్మిక జీవన విధానంలో వ్యక్తిగా గుర్తింపే లేదు. వారి దృష్టిలో ఛాయా మాత్రపు జీవనం ఆమెది. బతికినన్నాళ్లూ బలవంతంగా అణచి వేయబడి, మరణించిన తర్వాత ఆత్మలేని, అస్తిత్వం లేని ఒకలాంటి అయోమయ దశలో ఉండిపోతారు. ఇలాంటి అభిప్రాయాన్ని గతంలో క్రైస్తవ మిషనరీలు కొంత వరకు కలిగించాయి. కొంతమంది అది నిజమేనని నమ్మారు కూడా.

పాశ్చాత్యుల మనసులో నాటుకుపోయిన ఈ అభిప్రాయాలకు వినోద మాధ్యమంగా ఉన్న మీడియా కూడా తోడయింది. అదే అరేబియన్ నైట్స్ హాలీవుడ్ వర్షన్స్‌లో కన్పించే ముస్లిం నివాసాలలోని మహిళ. విలాసవంతమైన భవనాల్లో ఆకర్షణీయమైన జిలుగువెలుగుల దుస్తులు ధరించి, నగలతో అలంకరించుకుని తన యజమాని అయిన సుల్తాన్ దృష్టిలో పడే అవకాశం కోసం ఎదురు చూస్తూ ఉండే మహిళ.

పరదా మాటున పవిత్రతకు మారుపేరులా కన్పిస్తూ ఆమె అంతరంగం ఎవరికీ అంతుపట్టని మహిళ, క్రూరుడైన భర్తకు భయపడుతూ బతికే మహిళ.. డ్రాగన్‌ను చంపి తనని రక్షించే సెయింట్ జార్జి కోసం వేచి చూసే నిస్సహాయ స్థితిలో ఉన్న సంప్రదాయ మహిళ... యజమానిని సంతోషపెట్టడానికి పట్టు దుస్తులు, నగలతో మెరిసే బానిస మహిళ... పాశ్చాత్యుల ఊహాచిత్రణకి ఇవన్నీ బాగా సరిపోయాయి. పాశ్చాత్య స్త్రీ పురుషుల్లో వారి జీవితకాలంలో ఏదో ఒక దశలో ఇలాంటి పాత్రల్లో తమను తాము ఊహించుకోని వారెవరు? ఈ కల్పన ఎక్కువకాలం కొనసాగుతోందంటే అదే కారణం. ఇలాంటి మహిళలు నిజంగా ఉంటారని నమ్మడానికి మనం ఇష్టపడతాం. అప్పుడే వారి చుట్టూ మనం పగటికలలు అల్లుకోవడం సాధ్యమవుతుంది. స్త్రీ స్వేచ్ఛ అనే అంశానికి పూర్తి విరుద్ధంగా ఉండే ఇలాంటి పరిస్థితులను బహిరంగంగా ఖండించినప్పటికీ ఆ కాల్పనిక లోకాన్ని మాత్రం కాదనం. ఈ కాల్పనిక లోకాన్ని మనం గుర్తించి కూడా అందులోనుంచి బయటపడలేదంటే... అది చక్కని పలాయనవాదం తప్ప మరొకటి కాదు.

కానీ మనం ఇప్పుడు ఇస్లాం మతంలో మహిళల పాత్ర గురించి చర్చించాలి. ఒక ముస్లిం మహిళ మతపరంగా నిర్వహించే పాత్ర ఏమిటో తెలుసుకోవాలి. అందుకు మనకు విశ్వసనీయమైన ఆధారం ఇలాంటి ఊహాత్మక,

కాల్పనిక కథలు కాదు, హాలీవుడ్ చిత్రణలు అంతకన్నా కాదు అందుకు ముఖ్యమైన ఆధారం ఖుర్‌ఆన్. ముహమ్మద్ ప్రవక్త స్వయంగా చెప్పగా, ఆచరించగా నమోదు చేయబడిన హదీసులు.

మహిళలకు సంబంధించి ఖుర్‌ఆన్‌లో రాసిన సూక్తుల నుంచి, ముహమ్మద్ ప్రవక్త చెప్పిన అంశాలనుంచి కొన్నిటిని పాఠకుల దృష్టికి తేవడం నా ఉద్దేశం. ఆచరణలో స్త్రీ జీవితానికి సంబంధించి అవి చెప్పే అర్థాలను వివరించడమే నా లక్ష్యం. గతంలో కానీ, వర్తమానంలో కానీ వేర్వేరు దేశాల్లో ముస్లిం వనితల స్థితిగతులను చర్చించడం ఇక్కడ నా ఉద్దేశం కాదు. ఎందు కంటే రకరకాల కారణాలు, స్థానిక సంస్కృతి సంప్రదాయాల ప్రభావాలు వాటి మీద ఉంటాయి.

## ఆధ్యాత్మిక రంగంలో మహిళల స్థానం

మహిళలకు అసలు ఆత్మలు ఉంటాయా? అవి స్వర్గాన్ని అనుభూతి చెందగలుగుతాయా? అన్న అపోహలను తొలగించి వాస్తవాలను ముందుగా నేను పాఠకులకు స్పష్టం చేయదలచుకున్నాను. ఖుర్‌ఆన్ ఈ విషయాన్ని చాలా స్పష్టంగా చెప్పింది. స్త్రీలు, పురుషులు ఎవరైతే ఇస్లాం ధర్మాన్ని ఆచరిస్తారో వారు సమాన ప్రతిఫలం పొందుతారని ఖుర్‌ఆన్ విశదపరిచింది.

> **"నిశ్చయంగా ముస్లిములూ, విశ్వాసులూ, విధేయులూ, నిజాయితీ పరులూ, సహనశీలురూ, అల్లాహ్ ముందు వినమ్రులయ్యేవారూ, దానధర్మాలు చేసేవారూ, ఉపవాసం ఉండేవారూ, తమ మర్మాంగాలను కాపాడుకునేవారూ, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించేవారూ, అయినస్త్రీ పురుషుల నిమిత్తం అల్లాహ్ క్షమాభిక్షను, గొప్ప ప్రతిఫలాన్ని సిద్ధపరిచి ఉంచాడు."** ***(దివ్య ఖుర్‌ఆన్ 33 : 35)***

ఇంకా దైవం ఇలా అన్నాడు...

**"పురుషుడైనా స్త్రీ అయినా సత్కర్మలు చేస్తే, విశ్వాసి అయిన పక్షంలో మేము అతనిని ప్రపంచంలో పరిశుద్ధ జీవితం గడిపేలా చేస్తాము. (పరలోకంలో) అటువంటి వారికి వారి ఉత్తమ కార్యాలకు అనుగుణంగా ప్రతిఫలాలను ప్రసాదిస్తాము." (దివ్య ఖుర్‌ఆన్ 16 : 97)**

ఇస్లాంకి మూల స్తంభాలుగా పేర్కొనే ఐదు అంశాలు... విశ్వాసం, ఆరాధన, ఉపవాసం, జకాత్, హజ్ యాత్ర... ఇవన్నీ పురుషుడికి ఎంత ముఖ్యమో, స్త్రీకీ అంతే ముఖ్యం. అలాగే వారికి లభించే ఫలితంలోనూ తేడా లేదు.

ఖుర్‌ఆన్‌లో దైవం ఇలా పేర్కొన్నాడు...

**'వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు.'** ***(దివ్య ఖుర్‌ఆన్49:13)***

మరో విషయం కూడా ఇక్కడ మీరు గుర్తుంచుకోవాలి. ఇస్లాంలో ఎంతో పేరొందిన మార్మిక కవయిత్రి రబియా అల్ అదావియా... ఒక మహిళేనన్న అంశం మరవరాదు.

## మేధోపరంగా స్త్రీహోదా

ఇస్లాంలో స్త్రీ పురుషుల ఆధ్యాత్మిక సమానత్వం గురించి సందేహాలు నివృత్తి అయ్యాయి కదా... ఇప్పుడు వారి మేధోపరమైన స్థితిగతుల గురించి తెలుసుకుందాం. చదువు, విజ్ఞానం తదితర అంశాల సంగతేమిటో చూద్దాం.

ముహమ్మద్ ప్రవక్త ఏమన్నారంటే...

'జ్ఞానాన్వేషణ అనేది ప్రతి ముస్లిం బాధ్యత (స్త్రీ అయినా పురుషుడైనా)'.

ఇంకా

'ఊయల నుంచి సమాధి వరకూ మధ్యనున్న మనిషి జీవితమంతా జ్ఞానాన్వేషణలో సాగాలి'.

'ముస్లిం వ్యక్తికి జ్ఞానం అనేదాన్ని పారలౌకికమూ, లౌకికము అని విడివిడిగా విభజించలేదు. దీనిపై ముహమ్మద్ ప్రవక్త చెప్పిన అంశాలను ఆధునిక కాలానికి అన్వయిస్తే; ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ చెప్పినట్లు ప్రతి ముస్లిం బాలుడు, బాలిక, స్త్రీ, పురుషుడు తమ శక్తి మేరకు విద్యనభ్యసించాలి."

**'అల్లాహ్ దాసులలో జ్ఞానులు మాత్రమే ఆయనకు భయపడతారు.'**

***(దివ్య ఖుర్‌ఆన్ 35 : 28)***

దీన్ని బట్టి ఇస్లాంలో స్త్రీ పురుషులు మేధోవికాసానికి నేర్చుకోవడం లోను, అర్థం చేసుకోవడంలోనూ, బోధనలోనూ సమాన సామర్థ్యం కలిగివున్నా రని అర్థమవుతుంది. జ్ఞానార్జన ఉద్దేశాలలో అన్నిటికన్నా ముఖ్యమైంది దైవం పట్ల మరింత ఎక్కువ తెలుసుకుని ఉండడం. ఎవరైనా సరే... సృష్టిని, సృష్టి విధానాలను ఎంత ఎక్కువగా తెలుసుకుంటే, గమనిస్తే.. ఆ వ్యక్తి సృష్టికర్తని, అతని శక్తిని అర్థం చేసుకోగలరని ఇస్లాం నమ్ముతుంది.

ఇస్లాం చరిత్రలో అత్యంత ప్రముఖ మహిళ ఆయేషా(రజి). ఆమె ముహమ్మద్ ప్రవక్త (స) గారి సతీమణి. గొప్ప తెలివితేటలు, అపారమైన జ్ఞాపక శక్తి ఆమె సొంతం. ఈ సుగుణాల కారణంగా ఆమెను హదీసులో ఒక ముఖ్య మైన సోర్స్‌గా పరిగణిస్తారు. వెయ్యి కన్నా ఎక్కువ హదీసులు ఆమె పేర్కొన్నారు. హదీస్ బోధకులలో ఎంతో గొప్ప వ్యక్తిగా ఆమెను గుర్తిస్తారు.

వాస్తవానికి మధ్యయుగం నాటి ముస్లిం ప్రపంచంలో మహిళలు చదువు కోవడంపై ఎలాంటి ఆంక్షలు, నిషేధాలు లేవు. పైగా మతం చదువుకోమని

ప్రోత్సహించేది కూడా. ఫలితంగా ఎందరో మహిళలు మతపరమైన మేధావులుగా, రచయిత్రులుగా, కవయిత్రులుగా, వైద్యులుగా, ఉపాధ్యాయులుగా పేరొందారు. అందుకు నిదర్శనాలు... అలీ కుటుంబ వారసురాలైన నఫీసా. హదీసుపైన ఆమెకు ఎంత పట్టు ఉందంటే, ఇమాం అల్ షఫీ అల్ ఫుస్తాట్ వద్ద ఆమె బృందంలో కూర్చుని అభ్యసించారు. ఆ సమయంలో ఆయన తన జీవితంలో గుర్తింపు పొందిన పండితుడన్న విషయం ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి. మరో మహిళ షైఖా షుహుదా బహిరంగ సభలో ప్రసంగించేవారు. బాగ్దాద్‌లోని ప్రముఖ ప్రార్థనాలయంలో ఈ సభ జరిగింది. పలువురు ఆసక్తితో ఆలకించిన ఈ సభలో ఆమె సాహిత్యం, కవిత్వం తదితర అంశాలపై ప్రసంగించారు. ఇస్లాం చరిత్రలో ఆమెను తొలివరుస మేధావుల్లో ఒకరిగా పేర్కొంటారు.(అహ్మద్ షాలబీ: హిస్టరీ ఆఫ్ ముస్లిం ఎడ్యుకేషన్, పుట 193)

వీరే కాదు, వివిధ రంగాలలో రాణించిన పలువురు విద్యావంతులైన ముస్లిం మహిళలు ఎందరో ఉన్నారు. వారందరినీ ముస్లిం సమాజం అత్యంత గౌరవంతో చూసింది. దీన్ని బట్టి చూస్తే ముస్లిం మహిళలకు తమకు ఇష్టం ఉన్న రంగాల్లో ఇష్టం ఉన్న మేరకు విద్యనభ్యసించి, తమ జ్ఞానాన్ని పెంచుకునే అవకాశం, ఆయా రంగాల్లో వృత్తినిపుణులుగా, సుశిక్షితులుగా రాణించే అవకాశం, సమాజంకోసం తమ తెలివితేటల్ని, విద్యని ఉపయోగించే అవకాశం పూర్తి స్థాయిలో ఉన్నాయని అవగతమవుతోంది. ఇక్కడ కొన్ని నైతిక అంశాలున్నాయి వాటి గురించి మనం తర్వాతి పుటలలో తెలుసుకుంటాం.

## స్త్రీ పురుష సంబంధాలు

ఆధ్యాత్మికంగా, మేధోపరంగానూ అభివృద్ధి చెందడానికి మహిళలకున్న స్వాతంత్ర్యం గురించి తెలుసుకున్నాం కదా ఇప్పుడు నేను పురుషులతో మహిళల

సంబంధం గురించి చర్చిస్తాను. పరస్పరాధారితం అయిన అనుబంధం గురించి మనం తెలుసుకొనబోతున్నాం. పవిత్ర ఖురాను ఏమంటుందంటే...

> **'ఆయన మీ కొరకు భార్యలను మీ జాతిలో నుండే సృష్టించాడు. – మీరు వారి వద్ద శాంతిని పొందటానికి, మీ మధ్య ప్రేమనూ, కారుణ్యాన్నీ సృజించాడు. నిశ్చయంగా ఆలోచనాపరులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి.'** ***(దివ్యఖుర్‌ఆన్ 30: 21)***

భార్య, భర్తలుగా స్త్రీ పురుషుల అనుబంధానికి సంబంధించి చాలా ముఖ్యమైన నిర్వచనం ఇది. వారు పరస్పరం ఒకరి సన్నిధిలో ఒకరు ప్రశాంతత, సాంత్వన పొందాలి. కేవలం లైంగిక సంబంధంతోనే కాక ప్రేమ, దయలతో ఒకరికొకరు కట్టుబడి ఉండాలి. దీనికి అర్థం... ఒకరి పట్ల ఒకరికి శ్రద్ధ, సానుభూతి, గౌరవం, ఆప్యాయత ఉండాలని.

ఆయిషా (రజి) పేర్కొన్న హదీసులు ఎన్నో ఉన్నాయి. అవన్నీ ముహమ్మద్ ప్రవక్త (సఅసం) తన భార్యల్ని ఎలా చూసేవారో, వారు ఆయనను ఎలా చూసుకొనేవారో స్పష్టంగా తెలియజేస్తాయి. పరస్పరం వారు చూపిన శ్రద్ధ, వివాహబంధం పట్ల గౌరవం ఎంతో ఆశ్చర్యం కలిగిస్తాయి. భార్యల్లో ఎలాంటి బానిసభావం లేదు. భార్యలను సంతోషపెట్టడానికి ప్రవక్త, ప్రవక్తను సంతోషపెట్టడానికి భార్యలు రకరకాల పనులు చేసిన సందర్భాలు అందులో కన్పిస్తాయి.

మరో అధ్యాయంలో ఖుర్‌ఆన్ భార్యల గురించి ఇలా పేర్కొంటోంది...

**'వారు మీకు దుస్తులు, మీరు వారికి దుస్తులు.'(2:187).**

దీని అర్థం... వస్త్రాలు ఏవిధంగానైతే శరీరాన్ని బాహ్యావాతావరణం నుంచి కాపాడుతూ, హుందాతనాన్ని, వెచ్చదనాన్ని ఇస్తాయో అలాగే

భార్యాభర్తలు కూడా ఒకరికొకరు సాన్నిహిత్యాన్ని, సౌకర్యాన్ని, రక్షణని ఇవ్వాలి. అప్పుడు ఇద్దరిలో ఎవరూ కూడా ఎలాంటి నేరాలూ చేయరు.

ఖుర్‌ఆన్ పేర్కొన్నదాన్ని బట్టి అర్థమయ్యేదేంటంటే మానవ సంబంధాలను, ప్రవర్తనను క్రమబద్ధీకరించడానికి తోడ్పడే ఇస్లామ్ నియమాల ప్రధాన ఉద్దేశం కుటుంబం అనే వ్యవస్థను పరిరక్షించడం. శాంతి, ప్రేమ, కరుణ, దైవస్పృహ లాంటి గుణాలన్నీ అందులో ఉండేలా చూడడం. అలా ఉన్నప్పుడు స్త్రీపురుషులకు, వివాహం ద్వారా వారికి కలిగిన సంతానం సహజ వికాసంతో శోభిల్లడానికి ఆ కుటుంబం ఎంతగానో తోడ్పడుతుంది.

వివాహబంధం లోపలైనా, బయటైనా స్త్రీ పురుషుల ప్రవర్తనను మనం పరిశీలించేటప్పుడు ఈ అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి. వాటి వల్ల వ్యక్తికి, సమాజానికి కలిగే ప్రయోజనాలను తులనాత్మకంగా చూడాలి. ముఖ్యమైన మరో అంశం ఏమిటంటే ఇస్లాం జీవితం పట్ల సమగ్రమైన దృక్పథాన్ని కలిగివుంది. అందులో ఉండే పలు అంశాలను ఒకదానితో మరొకదానికి సంబంధం లేకుండా విడదీసి చూడకూడదు. పరిపూర్ణ జీవన విధానాన్ని ఇస్లాం చూపుతోంది. అందులో ప్రతి అంశాన్నీ మిగతా వాటితో ముడిపెట్టి చూడాల్సిందే కానీ విడివిడిగా కాదు.

ఇక ముస్లిం సమాజంలో స్త్రీ పోషించే పాత్ర గురించి తెలుసుకోవాలంటే ఆమె బాధ్యతల్ని, హక్కుల్ని కూడా మనం తెలుసుకోవాలి. పురుషుల పట్ల ఆమె ప్రవర్తన ఎలా ఉండాలో, అలాగే ఆమె పట్ల పురుషుల ప్రవర్తన ఎలా ఉండాలో తెలుసుకోవాలి.

## హక్కులు.. బాధ్యతలు

ముందుగా పురుషుడినుంచి స్త్రీకి ఏం లభించాలో చూద్దాం. పవిత్ర

ఖుర్‌ఆను ఏ చెప్తోందంటే...

**'పురుషులు స్త్రీలకు అధికారులు (ఖవ్వామ్), ఎందుకంటే అల్లాహ్ వారిలో ఒకరికి మరొకరిపై ఆధిక్యతలను ప్రసాదించటం వల్ల, ఇంకా పురుషులు తమ సంపదను వారి కొరకు ఖర్చు చేస్తున్నందు వల్ల.'** ***(దివ్యఖుర్‌ఆన్ 4: 34)***

దీన్నిబట్టి ముస్లిం సమాజంలో కుటుంబ పోషణ పూర్తి బాధ్యత పురుషునిదే. ఇది నైతికపరమైనదే కాదు, చట్టపరమైన బాధ్యత కూడా. భార్య సంపాదించింది ఏదైనా అది ఆమె సొంతమే. సంసారం కోసం వాడాలనుకున్నా , తన సొంతానికి వాడుకున్నా ఆమె ఇష్టప్రకారమే జరగాలి.

ఇక కుటుంబ సంక్షేమం బాధ్యత భార్యది. కుటుంబానికి సంబంధించిన అన్ని అంశాల్లోనూ ఆమె తన అభిప్రాయాన్ని చెప్పవచ్చు, సలహాలు, సూచనలు ఇవ్వవచ్చు. వివాహబంధాన్ని, కుటుంబ అనుబంధాన్ని సుదృఢంగా ఉంచడంలో ఆమె కీలక పాత్ర పోషిస్తుంది. కుటుంబాన్ని సజావుగా నిర్వహించడంలో భర్త పోషించే పాత్రను ఆమె గుర్తిస్తుంది.. గౌరవిస్తుంది... కొన్ని సందర్భాల్లో అతని నిర్ణయాలు తప్పనిపించినా అంగీకరిస్తుంది. అయితే అతను ఇస్లాం పరిధిని దాటనంతవరకే. పెళ్లికి సంబంధించి ఇస్లాంలో విధేయత అంటే ఇంతవరకే. కుటుంబ పెద్దగా భర్త స్థానాన్ని గౌరవించడం. మరింత గొప్పదైన షరియత్ చట్టానికి భార్యాభర్తలు కట్టుబడి ఉండడం.

ముహమ్మద్ ప్రవక్త (స) ఇలా అన్నారు...

'మహాప్రవక్తను ఎవరో అడిగారు, 'ఉత్తమ మహిళ ఎవరు?' అని. దానికి మహాప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "ఏ మహిళయితే భర్త తన వైపు చూసినప్పుడు అతన్ని ప్రసన్నం చేస్తుందో, ఎవరయితే భర్త ఏదైనా చెయ్యమన్న

ప్పుడు ఎదురు చెప్పకుండా చేస్తుందో, ఎవరైతే తన విషయంలో, తన సొత్తు విషయంలో తన భర్త మనస్సు నొప్పించే వైఖరి అవలంబించదో ఆమె ఉత్తమ మహిళ'.

అలాగే భార్య బాగోగులు చూసుకోవడం పురుషుని విధి. ఆమె పట్ల మాత్రమే కాదు, యావత్ స్త్రీ జాతి పట్ల అతను సానుభూతితో దయతో మెలగాలి. ఈ తరహా మనోభావం తొలితరం ముస్లిం ప్రపంచంలోనే ఉదయించింది. పలువురు మేధావులు దాన్ని పెంచి పోషించారు. ముస్లిముల ద్వారానే అది మధ్యయుగం నాటి ఫ్రాన్స్ ట్రోబదోర్స్ ద్వారా యూరోపులో ప్రవేశించింది. అయితే ఇటీవలి కాలంలో ఈ తరహా భావనలకు చాలా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. గత యాభయ్యేళ్లలో సమాజాల్లో చోటుచేసుకుంటున్న మార్పుల్ని గమనిస్తే పురుషులతో సమానంగా మహిళలు కూడా ఈ కఠోరమైన సమాజంలో జీవనాధారం కోసం నానా కష్టాలు పడ వలసి వస్తోంది. ఆమెను ఈ నిత్యజీవన సమరానికి దూరంగా వదిలివేయాలని, అప్పుడే ఆమె తన పూర్తి శక్తిసామర్థ్యాలను ఇంటిని తీర్చిదిద్దుకోవడానికి వెచ్చించగలుగుతుందని ముస్లిం సమాజం భావిస్తుంది. భర్త సంతోషం, బిడ్డల సంక్షేమం ముస్లిం వనిత జీవితంలో ప్రధాన అంశాలు. పిల్లల భౌతిక, ఆధ్యాత్మిక అభివృద్ధిలో తల్లి ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఇల్లు సుఖ సంతోషాలతో శోభిల్లేలా, భర్త, బిడ్డలకు ప్రశాంతమైన, భద్రమైన జీవితాన్ని అందివ్వడం ఆమె లక్ష్యాలుగా ఉంటాయి. పిన్న వయసులో పిల్లలకు తల్లి నుంచి అందే శిక్షణే పెద్దవారయ్యాక వారి నడవడికను, వ్యక్తిత్వాలను తీర్చిదిద్దుతుంది. అంటే తమ తర్వాతి తరాన్ని తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఆమె మీద ఉంటుంది. మహిళకు సంబంధించి ఈ పాత్ర ప్రాధాన్యాన్ని తెలిపే ఒక లోకోక్తి అరబిక్‌లో ఉంది. దాని అర్థం... తల్లే ఒక పాఠశాల అని.

## ఇస్లాంలో వివాహం

ఇప్పుడిక ఇస్లాంలో వివాహ పద్ధతులను పరిశీలిద్దాం. కుమార్తె యుక్త వయసుకు రాగానే ఆమెకు తగిన భాగస్వామిని వెదికే బాధ్యత తల్లిదండ్రుల భుజస్కంధాలమీద పడుతుంది. అయితే దాని అర్థం తమకు నచ్చినవాడిని ఇచ్చి పెళ్లిచేయడం కానే కాదు. ఆమె సమ్మతి తప్పకుండా ఉండాలి. ఒకసారి ఒక యువతి తన సమ్మతి లేకుండా పెళ్లి చేశారని ప్రవక్తకు ఫిర్యాదు చేసింది. ప్రవక్త వెంటనే ఆ పెళ్లి చెల్లదని, ఆమె కోరుకుంటే ఇష్టంలేని ఆ బంధం నుంచి అప్పటి కప్పుడు బయటపడవచ్చని పేర్కొన్నట్లు చెప్పారు.

ఈ రోజుల్లో చదువుకున్న ముస్లిం యువతులు జీవిత భాగస్వామి ఎంపిక విషయంలో మరింత ఎక్కువ స్వేచ్ఛని కలిగి వుంటున్నారు. కానీ ఇప్పటికీ ఇంకా తల్లిదండ్రుల ఇష్టానికే అధిక ప్రాధాన్యం లభిస్తోందన్నది పలువురి అభిప్రాయం. తల్లిదండ్రుల అభిమతానికి వ్యతిరేకంగా పెళ్లి చేసుకోవడమనేది యువతీయువకులకు ఇప్పటికీ కష్టమే. తల్లిదండ్రులు, సంరక్షకుల సమ్మతితో పెళ్లి జరగడమనేది ఇస్లాం సంప్రదాయంలో ఒక భాగం.

అదే ఒక వితంతువు కానీ విడాకులు పొందిన వనిత కానీ అయితే తన ఇష్టప్రకారం పెళ్లి చేసుకోవచ్చు. అందుకు కారణం ఆమె తన జీవితానికి సంబం ధించి తగిన నిర్ణయం తీసుకోగల మానసిక పరిణతి సాధించి వుంటుందన్న నమ్మకమే. జీవితానుభవం ఆమెకా పరిణతినిస్తుందని భావిస్తారు.

వివాహం నిశ్చయమయ్యాక వివాహతంతులో భాగంగా వరుడు వధువుకు మహర్ ఇవ్వాలి. ఇరువైపుల వారి అంగీకారంతో అది ఎంతైనా ఉండవచ్చు. ఇది వరకట్నం లాంటిదికాదు. వధువు తండ్రి పెళ్లి సమయంలో తన కుమార్తెకు ఇచ్చే కట్నాన్ని డౌరీ అంటారు. వివాహానంతరం అది వరుడి ఆస్తిలో భాగమవుతుంది. అలాగని ఇది కన్యాశుల్కం కూడా కాదు. అక్కడ

వరుడు తనకు పిల్లనిస్తున్నందుకు కాబోయే మామగారికి పరిహారంగా ఈ కన్యాశుల్కం చెల్లిస్తాడు. ముస్లిం వివాహంలో మహర్ అంటే వివాహ సమయంలో వరుడు వధువుకు సమర్పించే కానుక లాంటిది. అది పూర్తిగా ఆమె సొంతం. దాని మీద ఇంకెవరికీ ఎలాంటి హక్కులు ఉండవు (తర్వాత ఒకవేళ ఆ జంట విడాకులు తీసుకున్నా మహర్ ఆమెకే చెందుతుంది. ఒకవేళ విడాకులు ఆమే కోరుకుంటే ఖులా అంటారు దీన్ని, అప్పుడు మాత్రం మొత్తం కానీ అందులో కొంతకానీ ఆమె చెల్లించాల్సి వుంటుంది).

భార్య పట్ల భర్త ప్రవర్తన ఎలా ఉండాలనే విషయం కూడా ఖుర్‌ఆన్‌లో స్పష్టంగా చెప్పబడింది. వారిద్దరు పరస్పరం సయోధ్యతో ఉన్నా లేకున్నా... భర్త ఎలా ఉండాలంటే...

> **'వారితో సద్భావంతో జీవితం గడపండి. ఒకవేళ మీకు వారు నచ్చకపోతే, బహుశా మీకు ఒక వస్తువు నచ్చకపోవచ్చు. కాని అందులోనే అల్లాహ్ ఎంతో మేలును పెట్టి వుండవచ్చు.'**
>
> ***(దివ్యఖుర్‌ఆన్ 4:19)***

ఇస్లాం మహిళలకు కల్పించిన మరో ముఖ్యమైన వెసులుబాటు ఏమిటంటే... నైతికపరంగా చూస్తే ఎక్కడా కూడా మహిళలు, పురుషుల పట్ల ద్వంద్వ ప్రమాణాలు లేవు. తమ తప్పుల్ని వదిలేసి మహిళల మీద ఆరోపణలు చేయడం, నిందవేయడం అనేది ప్రపంచవ్యాప్తంగా పురుషులంతా చేసేదే కానీ ఖుర్‌ఆన్ ప్రకారం, ముహమ్మద్ ప్రవక్త (స) బోధనల ప్రకారం నైతిక ప్రవర్తన విషయంలో స్త్రీలనుంచి ఏ ప్రమాణాలనైతే ఆశిస్తున్నామో పురుషులనుంచి కూడా అదే స్థాయి ఉన్నత ప్రమాణాలు ఉండాలి. నైతిక చట్టాలను ఉల్లంఘిస్తే విధించే శిక్ష, జరిమానాల్లాంటివి స్త్రీ పురుషులిద్దరికీ సమానమే. దీనికి ఉదాహరణలు కూడా మనం ముందు ముందు పేజీలలో చూడవచ్చు.

విడాకులు నిశ్చయమైన సందర్భాల్లో కూడా పైన పేర్కొన్న సత్ప్రవర్తన ఉండి తీరాల్సిందే. ఖుర్‌ఆన్ ఏమంటుందంటే...

**'.... తరువాత భార్యను సక్రమంగా తమ వద్ద ఉండనివ్వాలి లేదా ఆమెను సహృదయంతో సాగనంపాలి. సాగనంపేటప్పుడు, మీరు వారికి పూర్వం ఇచ్చిన వాటి నుండి దేన్నయినా తిరిగి తీసుకోవటం ధర్మసమ్మతం కాదు'** ***(దివ్యఖుర్‌ఆన్ 2: 229)***

దీన్నిబట్టి మహర్ రూపంలో ఇచ్చింది కానీ, మరే విధమైన బహుమతులు కానీ భార్యకిచ్చినవి భర్త తిరిగి తీసుకోకూడదు.

ఖుర్‌ఆన్ ఇంకా ఇలా కూడా పేర్కొంది...

**'మీరు మీ స్త్రీలకు విడాకులిచ్చినప్పుడు, వారి కొరకు నిర్ణయింపబడిన గడువు (ఇద్దత్) దగ్గరపడగానే, వారిని సహృదయంతో మీవద్ద ఉంచుకోవాలి లేదా మంచితనంతో సాగనంపాలి. కేవలం పీడించే ఉద్దేశ్యంతో వారిని మీతో ఉంచుకోవటం అన్యాయం. ఆవిధంగా చేసేవాడు వాస్తవానికి తనకు తానే అన్యాయం చేసుకుంటున్నాడు"**

***(దివ్యఖుర్‌ఆన్ 2: 231)***

భార్యని, కుటుంబాన్ని దయగా చూడడమనేది ఇస్లాం ధర్మంలో ఒక భాగం. ముహమ్మద్ ప్రవక్త (స) ఏమన్నారంటే...

'దయగల ప్రవర్తన కలిగి, కుటుంబం పట్ల సానుభూతిపూర్వకంగా ఎవరైతే మసలుకొంటారో వారే ఇస్లాం పట్ల, దైవం పట్ల సరైన విశ్వాసం కలిగివున్నవారు..'

మరో హదీస్ ప్రకారం

'భార్య పట్ల అత్యంత దయగా వ్యవహరించినవారే మీలో ఉత్తములు..'

ఇస్లాంలో విడాకులు అనేది చిట్ట చివరి ప్రత్యామ్నాయం. ప్రవక్త ఇలా అన్నారు.. 'దైవం అనుమతించిన అన్ని అంశాల్లోనూ ఆయనకు అత్యంత ఇష్టంలేని అంశం విడాకులు.'

## విడాకులు

ఇస్లాంలో విడాకుల విధానం పున:సమీక్షకు ఎక్కువ అవకాశం కల్పించేలా ఉంటుంది. విడాకుల తర్వాత మహిళ మూడు నెలలపాటు వేచి ఉండాల్సి ఉంటుంది. ఆ మూడునెలలు ఆమె సంరక్షణ బాధ్యత భర్తదే. ఈ సమయంలో ఆమెను ఇంటినుంచి బయటకు వెళ్లిపొమ్మనే అధికారం అతనికి లేదు. ఆమె ఇష్టపడి వెళ్లిపోవాలనుకుంటే వెళ్లిపోవచ్చు. ఈ మూడు నెలల నిరీక్షణ కాలం ప్రధాన ఉద్దేశం... విడాకుల నాటికి ఆమె గర్భిణి కాదని నిర్ధారణ చేసుకోవడం ఒకటైతే... మరో కారణం, భార్యాభర్తలిద్దరూ తమ మధ్య ఉన్న బంధం గురించి మరోసారి పునరాలోచించుకునే అవకాశం కల్పించడం. ఇరువురి తరఫు బంధువులు, శ్రేయోభిలాషులు , సమాజంలోని పెద్దలు వారికి ఈ దిశగా సహాయం చేస్తారు. ఇంకా ఈ విషయమై ఖుర్ఆన్ ఏం చెప్తోందంటే...

> **'భార్యాభర్తల మధ్య సంబంధాలు చెడిపోతాయనే భయం మీకు కలిగితే, భర్త బంధువుల నుండి ఒక మధ్యవర్తిని, భార్య బంధువుల నుండి ఒక మధ్యవర్తిని నియమించండి. వారిద్దరు సంస్కరణను కోరితే అల్లాహ్ వారి మధ్య సమాధానం కుదరటానికి మార్గం చూపుతాడు. అల్లాహ్ సర్వజ్ఞాని, సకలమూ ఎరిగినవాడు.'**
>
> ***(దివ్యఖుర్ఆన్ 4: 35)***

ఈ విధమైన పునరాలోచన వారిని విడాకులనుంచి వెనక్కి మళ్లేలా చేస్తే

నిరీక్షణ సమయంలోని మూడు నెలల్లో ఎప్పుడైనా వారు వివాహబంధాన్ని పునరుద్ధరించుకోవచ్చు. అప్పుడు విడాకులు వాటంతటవే వీగిపోతాయి. ఒకవేళ మళ్లీ ఇద్దరి మధ్య గొడవలు వచ్చి రెండోసారి వ్యవహారం విడాకుల దాకా వస్తే అప్పుడు కూడా ఇదే పద్ధతి అనుసరిస్తారు. మూడోసారి విడాకుల వరకూ వస్తే మాత్రం తిరిగి వెనక్కి వెళ్లడానికి లేదు. మూడు నెలల తర్వాత ఆ మహిళ స్వతంత్రంగా వ్యవహరించగలుగుతుంది. తనకు నచ్చిన వ్యక్తిని వివాహమాడ వచ్చు. ఒకవేళ మొదటి భర్త మళ్లీ ఆమెను పెళ్లి చేసుకోవాలనుకుంటే వీలు కాదు. ఆమె మరో వ్యక్తిని పెళ్లాడి, విడాకులు పొందితే అప్పుడు మొదటి భర్త ఆమెను వివాహం చేసుకోవచ్చు.

సాధారణంగా పురుషుడు విడాకులు కోరుకుంటున్నట్లయితే లేదా ఇద్దరూ పరస్పర సమ్మతితో విడాకులు తీసుకోవాలనుకుంటే ఈ పద్ధతిని అనుసరిస్తారు. అలా కాకుండా భర్త అంగీకారం లేకుండా మహిళ విడాకులు కోరుకుంటున్నట్లయితే మాత్రం ఆమె కోర్టుకు వెళ్లి విడాకులు తీసుకోవచ్చు.

ప్రవక్త ముందుకు ఇలాంటి ఒక సందర్భం వచ్చినట్లు తెలుస్తోంది. తన భర్త చాలా మంచి వాడని, తనని బాగానే చూసుకుంటాడని, అతని మీద తనకెలాంటి ఫిర్యాదులు లేవని ఒక మహిళ ప్రవక్త ఎదుట చెప్పింది. కానీ ఎందుకో అతనంటే తనకు అయిష్టత ఏర్పడిందని, అతనితో కలిసి జీవించ లేనని ఆమె పేర్కొంది. వివాహ సమయంలో భర్త ఆమెకు కానుకగా ఇచ్చిన తోటను తిరిగి అతనికి ఇచ్చేసి ఆమె విడాకులు పొందవచ్చని ప్రవక్త ఆమెకు తెలిపారు. ఈ విధానం ఖుర్‌ఆన్‌లో అంగీకరించబడినదే... ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా అంటాడు :

**'అల్లాహ్ విధించిన హద్దులకు కట్టుబడి ఉండలేమనే భయం దంపతులకు కలిగిన పక్షంలో ఒక మినహాయింపు ఉంది. ఇలాంటి**

**సందర్భంలో దంపతులిద్దరూ అల్లాహ్ విధించిన హద్దులకు కట్టుబడి ఉండలేరనే భయం మీకు కలిగితే, స్త్రీ తన భర్తకు ఏదైనా పరిహారం ఇచ్చి వేరు కావటానికి వారిద్దరూ అంగీకరిస్తే, అందులో ఏమాత్రం దోషం లేదు.' *(దివ్యఖుర్‌ఆన్ 2: 229)***

ఇక్కడ మనం ఒక విషయం గమనించవచ్చు. ఇంగ్లాండ్‌లో కానీ ఇతర పాశ్చాత్య దేశాల్లో కానీ పెళ్లికి సంబంధించిన చట్టాల్లో ఆధునిక ప్రగతిని పరిశీలిస్తే అవి ఇస్లామ్ విధానాలకు దగ్గరగా ఉన్నట్లు కన్పిస్తాయి. అది అనాలోచితంగానే అయినా చాలా మార్గాల్లో... విడాకులకు ముందు పెద్దల మార్గదర్శకత్వం, కౌన్సెలింగ్‌పై దృష్టిపెట్టడం... విడాకుల విధానం ఆంతరంగిక వ్యవహారంలా పరిగణించడం, కలిసి ఉండడం సాధ్యం కాదని ఒకసారి నిర్ణయమైపోయాక విడాకుల విధానాన్ని సత్వరం పూర్తి చేయడం... లాంటివన్నీ ఇస్లామ్ విధానాలను పోలినట్లుగా అనిపిస్తాయి.

ఇస్లాం న్యాయవిధానం సంతోషంగా లేని దంపతులను కలిసి ఉండమని బలవంతం చేయదు. కానీ ఆ విధానాలు వారిని మరోసారి తమ నిర్ణయం పునరాలోచించుకునేలా, ఒక అవకాశాన్ని కల్పిస్తాయి. సయోధ్య అసాధ్యమనుకున్న తర్వాత అనవసర ఆలస్యం చేయకుండా, అవరోధాలు కల్పించకుండా వారు విడిపోయి పునర్వివాహాలు చేసుకునే అవకాశం కల్పిస్తాయి.

## వారసత్వపు హక్కు

ఇస్లామ్ ధర్మశాస్త్రంలో మహిళలకు ఉన్న మరో ముఖ్యమైన హక్కు వారసత్వపు ఆస్తి హక్కు. వారసత్వంగా వచ్చిన ఆస్తిని విభజించే విధానం ఖుర్‌ఆన్‌లో వివరంగా పేర్కొనబడినది. పురుషుడికి ఇచ్చిన ఆస్తిలో సగం

మహిళకు చెందుతుంది. ఇతర చట్టాలను పట్టించుకోకుండా ఈ విషయం ఒక్కటే వింటే అన్యాయమేమో అన్పిస్తుంది కానీ, ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఖుర్‌ఆన్‌లో పేర్కొన్న ప్రకారం కుటుంబంలోని మహిళలు, పిల్లలందరి బాధ్యత పురుషులదే కాబట్టి వారికి ఖర్చు కూడా చాలా ఎక్కువ ఉంటుంది స్త్రీల ఖర్చుతో పోలిస్తే. దీన్ని బట్టి చూస్తే పురుషుడి ఆస్తిలో సగం స్త్రీకి ఒక్కదానికి ఇవ్వడమే చాలా ఉదారమైన విధానమనిపిస్తుంది. అలా ఆమెకు వచ్చిన డబ్బయినా, ఆస్తి అయినా, ఆమె నిర్వహించే వ్యాపారమేదైనా... వాటి మీద సర్వహక్కులు ఆమెవే. వాటిపై ఆమె భర్తకు ఎలాంటి హక్కు ఉండదు.

## తల్లిగా స్త్రీపాత్ర

భార్యగానే కాక తల్లిగా కూడా ముస్లిం వనిత ప్రాధాన్యం కల పాత్ర పోషిస్తుంది. ముస్లిం ప్రపంచంలో తల్లిదండ్రులకు ఇచ్చిన హెూదా, విలువ చాలా ఉన్నతమైనవి. ఖుర్‌ఆన్ ఏమంటుందంటే...

'నీ ప్రభువు ఇలా నిర్ణయం చేశాడు : మీరు కేవలం ఆయనను తప్ప మరెవరినీ ఆరాధించకండి. తల్లిదండ్రులతో మంచితనంతో వ్యవహరించండి. ఒకవేళ మీ వద్ద వారిలో ఒకరు గాని ఇద్దరు గాని ముసలివారై ఉంటే, వారి ముందు విసుగ్గా 'ఛీ' అని కూడా అనకండి. వారిని కసురుకుంటూ సమాధానం ఇవ్వకండి. వారితో మర్యాదగా మాట్లాడండి. మృదుత్వమూ, దయాభావమూ కలిగి వారిముందు వినమ్రులై ఉండండి. ఇలా ప్రార్థిస్తూ ఉండండి :

**"ప్రభూ! వారిపై కరుణజూపు, బాల్యంలో వారు నన్ను కారుణ్యంతో, వాత్సల్యంతో పోషించినట్లు"** ***(దివ్యఖుర్‌ఆన్ 17: 23,24)***

ఇంకా ప్రభువు ఇలా అన్నాడు :

**'మానవుడు తన తల్లిదండ్రుల హక్కును గుర్తించాలని స్వయంగా మేమే**

**అతనికి నిర్దేశించాము. అతని తల్లి బలహీనతపై బలహీనతను సహించి అతనిని తన కడుపున మోసింది. అతను పాలు విడిచిపెట్టటానికి రెండు సంవత్సరాలు పట్టింది. (ఇందుకే మేము అతనికి ఇలా బోధించాము) "నాకు కృతజ్ఞుడవై ఉండు, నీ తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపు. నావైపునకే నీవు మరలి రావలసి ఉన్నది.'** ***(దివ్య ఖుర్‌ఆన్ 31:14)***

ఒకసారి ముహమ్మద్ ప్రవక్త (సఅసం) వద్దకు ఒక వ్యక్తి వచ్చాడు. వచ్చి ఇలా అడిగాడు... 'దైవ సందేశం విన్పించే ఓ ప్రవక్తా.. ఈ లోకంలో నేను అత్యధిక శ్రద్ధ తీసుకోవలసింది ఎవరి పట్ల?' అని అతడు ప్రశ్నించాడు. ప్రవక్త అతనికి ఇలా బదులిచ్చారు... 'నీ తల్లి (ఈ మాటను ఆయన మూడుసార్లు చర్చించారు)... తర్వాత నీ తండ్రి. ఆ తర్వాత నీ సన్నిహిత బంధువులు.. ఇతరులు వస్తారు'.

మరో హదీసులో ప్రవక్త ఇలా చెప్పారు : తల్లి పాదాల చెంతనే స్వర్గం ఉంది. ఇంకా వివరంగా చెప్పాలంటే తల్లిని గౌరవించి, ప్రేమించే వారికోసం స్వర్గద్వారాలు తెరిచి వుంటాయి.

బిడ్డల నుంచి తనకు లభించే భద్రత, వృద్ధాప్యంలో సంరక్షణల విషయంలో ముస్లిం మహిళ ఎంతో ధైర్యంగా ఉండగలుగుతుంది. పైన చెప్పిన ఖుర్‌ఆన్ సూక్తి పేర్కొన్నట్లుగా తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞతాపూర్వకంగా వ్యవహరించడం, దైవం పట్ల కృతజ్ఞతాభావంతో వ్యవహరించడాన్ని అనుసంధానించడం వల్ల ఈ రెండింటిలో ఏది నెరవేర్చకపోయినా మతధర్మాన్ని, బాధ్యతని నిర్వర్తించడంలో విఫలమైనట్లు పరిగణించబడుతుంది.

ఖుర్‌ఆన్, హదీస్‌లలో పేర్కొన్న ప్రకారం ఇస్లాం విధానాలన్నీ విశ్వాసం, సత్ప్రవర్తనల మీద ఆధారపడి సాగుతాయి. మంచి ప్రవర్తన అనేది ఇంట్లో,

సన్నిహిత కుటుంబ సభ్యుల వద్ద మొదలవుతుంది. తల్లిదండ్రులను గౌరవిస్తూ, ఆ మాటకొస్తే పెద్దలను ఎవరినైనా ఆదరంగా చూసే ఈ తరహా ఇస్లాం విధానాలను సంపూర్ణంగా ఆచరించే ముస్లిం కుటుంబాలను, సమాజాన్ని దగ్గరగా చూసిన పాశ్చాత్యులెవరైనా ఆశ్చర్యపోకమానరు.

## సమాజం- లైంగికత

భర్త, పిల్లల కోణం నుంచి ముస్లిం మహిళ హోదా గురించి మనం చర్చించాం. భర్త, సన్నిహిత బంధువులు కాని పురుషులతో స్త్రీ అనుబంధం ఎలా ఉంటుంది? ఈ విషయంలో మాత్రం వర్తమాన పాశ్చాత్య సమాజానికి ఇస్లామ్ ఆచారాలకు మధ్య చాలా తేడా కన్పిస్తుంది. పాశ్చాత్య సమాజంలో వివాహేతర లైంగిక సంబంధాలను సిద్ధాంత ప్రకారం పాపంగానూ, అవాంఛనీయంగానూ పరిగణిస్తారు. కానీ ఆచరణలో చాలా ఎక్కువగా, నానాటికీ పెరుగుతూ ఉన్న ప్రి మారిటల్ (వివాహానికి ముందు), వివాహేతర సంబంధాలను నివారించడానికి, తగ్గించడానికి తీసుకుంటున్న చర్యలేమీ లేవు. చట్టబద్ధత లేని సంబంధాలు, లైంగికంగా సంక్రమించే వ్యాధులు పెరుగుతున్నా అందుకు దారితీస్తున్న కారణాలను నియంత్రించే చర్యలు కనబడవు. పైగా సినిమాలు, టెలివిజన్, పత్రికలు లాంటి ప్రసార మాధ్యమాల్లో కొన్ని ప్రిమారిటల్ సెక్స్‌ని ప్రోత్సహించేలాంటి అభిప్రాయాలు ప్రసారమవు తుంటాయి. వివాహేతర సంబంధాలు సాధారణమేనంటాయి. ఈ తరహా జీవనశైలి తాలూకు అవాంఛిత సైడ్ ఎఫెక్టులను వదిలించుకోడానికి గర్భనిరోధక సాధనాలు, గర్భస్రావాలను ఉపయోగించుకోవాల్సిందిగా సూచిస్తుంటాయి.

ఈ అనియంత్రిత పరిస్థితికి విరుద్ధంగా ఉంటుంది ఇస్లాం విధానం. వివాహేతర లైంగిక ఆకర్షణలను తగ్గించడానికి ఎన్నో కచ్చితమైన విధానాలను ఇస్లాం నేర్పిస్తుంది.

మొట్టమొదటగా... ప్రవక్త ఏం సలహా ఇస్తారంటే ప్రతి ఒక్కరూ వివాహం చేసుకోవాలని. వివాహం ద్వారా వ్యక్తిగత సహజ వాంఛలన్నీ చట్టబద్ధంగా నెరవేర్చుకోవచ్చు.

రెండోది... ఇస్లాంలో పరిమితులతో కూడిన బహుభార్యత్వానికి అనుమతి ఉండడం వలన వివాహబంధానికి బయట ఒంటరిగా, అసహాయంగా ఉండే మహిళల సంఖ్య తగ్గుతుంది.

మూడోది... మహిళలు బహిరంగ ప్రదేశాల్లో హుందాగా కన్పించే వస్త్రధారణతో ఉండాలని ఖుర్‌ఆన్ సూచిస్తుంది.

ఆ వస్త్రధారణలో వారిని చూడగానే పురుషులకు ఆకర్షణ కలగకుండా గౌరవం కలగాలన్నది ఉద్దేశం.

నాలుగోది... ఇస్లామీయ జీవనవిధానంలో స్త్రీలకు పురుష స్నేహితులు, పురుషులకు ఆడ స్నేహితులు ఉండరు. అందరూ కలిసి పార్టీ చేసుకోవడం, నృత్యాలు చేయడం ఉండవు. మద్యం తీసుకోవడం లాంటి పాశ్చాత్య అలవాట్లు ఉండవు. ఇలాంటి పరిస్థితులే వివాహేతర సంబంధాలకు దారితీస్తాయి. సామూహిక వినోదం అంటే ఇస్లాంలో కుటుంబ సభ్యులంతా కలిసి వేడుక చేసుకోవడం. లేదంటే స్త్రీలు, పురుషులు విడివిడి బృందాలుగా ఏర్పడి ఆనందంగా గడపడం.

ఐదోది... వివాహేతర లైంగిక సంబంధం అనేది ఇస్లామ్ ధర్మశాస్త్రం ప్రకారం పాపం మాత్రమే కాదు శిక్షార్హమైన నేరం కూడా. దొంగతనం, హత్య లాంటి నేరాల్లాగే దీనికీ శిక్ష ఉంటుంది. అది కూడా స్త్రీ పురుషులకు సమానంగా ఉంటుంది. దీనివల్ల నేరం చేయడానికి వ్యక్తులు భయపడే అవకాశం ఎక్కువ.

ఇప్పుడు పైన పేర్కొన్న అంశాల్లో కొన్నిటిగురించి మరింత విపులంగా చర్చిద్దాం.

## వస్త్రధారణ

ముస్లిం స్త్రీ తన భర్త ముందు, కుటుంబ సభ్యుల ముందు, తన తోటి ఆడ స్నేహితులతో ఉన్నప్పుడు ఆమెకు ఇష్టమైన దుస్తులు ధరించవచ్చు. బయటకు వెళ్లినప్పుడు, ఆమె భర్త, కుటుంబ సన్నిహితులు కాని పురుషులున్నప్పుడు మాత్రం ఆమె వస్త్రధారణపై కొన్ని హద్దులు ఉన్నాయి. శరీరం పూర్తిగా కప్పేలా, ఆకృతిని బహిర్గతం చేయని తరహా దుస్తులు ఆమె ధరించాల్సి ఉంటుంది. పాశ్చాత్య ఫ్యాషన్ దుస్తులతో పోలిస్తే ఇది పూర్తిగా విరుద్ధం. అక్కడ ఏయేటికాయేడు కొత్త కొత్త విధానాల్లో శరీరం ఆకర్షణీయంగా కన్పించేలా కొంగొత్త ఫ్యాషన్లు పుట్టుకొస్తుంటాయి. మినిస్కర్టులని, హాట్ ప్యాంట్స్ అని, వెట్ లుక్ అని, సీ త్రూ దుస్తులని... ఎన్నెన్ని రకాలు రాలేదు! స్త్రీ శరీరంలో బయటకు కన్పించకూడని భాగాలను కూడా కన్పింపచేసేలా డిజైన్ చేసిన దుస్తులు వచ్చాయి. మహిళలకే కాదు, పురుషుల వస్త్రధారణ కూడా వెర్రితలలు వేయడం చూస్తూనే ఉన్నాం. శరీరాన్ని అంటిపెట్టుకుని ఉండే దుస్తులు పురుషులూ ధరిస్తున్నారు. అదృష్టవశాత్తూ సీ త్రూలు, టాప్‌లెస్‌లాంటి వాటి జోలికి ఇంకా పురుష డిజైనర్లు వెళ్లినట్లు లేరు.

శరీర ఆకృతిని ప్రస్ఫుటంగా కన్పించేలా చేయడం పాశ్చాత్య వస్త్ర ధారణ ఉద్దేశమైతే, ఆకృతి కన్పించని విధంగా దుస్తులు ధరించడం ఇస్లాం విధానం. దీనికి సంబంధించి ఖుర్‌ఆన్‌లో సూక్తి ఇలా ఉంది... '

ప్రవక్తా... నీ భార్యలకూ, నీ కూతుళ్ళకూ, విశ్వాసుల యొక్క స్త్రీలకూ తమ దుప్పట్ల కొంగులను తమపై వ్రేలాడ తీసుకోమని చెప్పు; వారు

**గుర్తింపబడటానికీ, వేధింపబడకుండా ఉండేందుకూ ఇది ఎంతో సముచితమైన పద్ధతి.'** ***(దివ్యఖుర్ఆన్ 33: 59)***

దీన్ని బట్టి ముస్లిం మహిళ ఇంటి నాలుగు గోడలు దాటి బయటకు వెళ్లినప్పుడు శిరస్సునుంచి పాదం వరకు మొత్తం కప్పేలా దుస్తులు ధరించాలి. కొంతమంది మేధావులు పేర్కొన్న అభిప్రాయం ప్రకారం చేతులు, ముఖం మాత్రం కప్పుకోకుండా వదిలివేయవచ్చు. మరికొంతమంది ముఖాన్ని కూడా కప్పుకోవాలంటారు. ఈ విషయంలో మాత్రం రెండు రకాల అభిప్రాయా లున్నాయి.

హుందాగా ప్రవర్తించాల్సిన బాధ్యత స్త్రీ ఒక్కదానిదే కాదు, ఖుర్ఆన్‌లో సూచనలు స్త్రీపురుషులిద్దరికీ సమానంగా ఆ బాధ్యతలున్నట్లు చెప్తాయి. దైవం ఇలా ఆదేశించాడు :

**'ప్రవక్తా! విశ్వసించిన పురుషులకు తమ చూపులను కాపాడుకోండి అనీ తమ మర్మాంగాలను రక్షించుకోండి అనీ చెప్పు. ఇది వారికి ఎంతో పరిశుద్ధమైన పద్ధతి. వారు చేసే దానిని గురించి అల్లాహ్‌కు బాగా తెలుసు. ....ప్రవక్తా! విశ్వసించిన మహిళలకు ఇలా చెప్పు, తమ చూపులను కాపాడుకోండి అని, తమ మర్మాంగాలను రక్షించుకోండి అని, తమ అలంకరణను ప్రదర్శించవలదని– దానంతట అదే కనిపించేది తప్ప తమ వక్షఃస్థలాలను ఓణీ అంచులతో కప్పుకోవాలని."**

***(దివ్యఖుర్ఆన్ 24: 30–31)***

## ప్రత్యేక పాత్ర

కుటుంబాన్ని మరింత పటిష్ఠం చేసే దిశగా, విచ్చలవిడి తనాన్ని తగ్గించేందుకు ఆచరించే మరో విధానం సెక్లూషన్ ఆఫ్ విమెన్. దీన్ని ఆచరించేవారు

ఖుర్‌ఆన్‌లోని ఈ వాక్యాలను ఆధారంగా చేసుకుంటారు... '

**'ఓ ప్రవక్త భార్యలారా! మీరు సాధారణ స్త్రీలవంటి వారు కారు. మీరు అల్లాహ్‌కు భయపడేవారు అయితే, తగ్గు స్వరంతో మాట్లాడకండి, ఎందుకంటే దుష్ట మనస్సు గల వ్యక్తి ఎవడైనా వ్యామోహపడవచ్చు. కాబట్టి స్పష్టంగా, సూటిగా మాట్లాడండి. ఇళ్ళల్లోనే ఉండిపొండి. పూర్వపు అజ్ఞాన కాలంలో మాదిరిగా అలంకరణను ప్రదర్శిస్తూ తిరగకండి. నమాజును స్థాపించండి, జకాత్ ఇవ్వండి. అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకూ విధేయత చూపండి."** ***(దివ్య ఖుర్‌ఆన్ 33: 32-33).***

వాస్తవానికి ఈ వాక్యాలు ప్రవక్త భార్యలను ఉద్దేశించి చెప్పినవి. కొంత మంది ఇవి వారికి మాత్రమే వర్తిస్తాయంటారు. ఇతరులు ఇవి ముస్లిం మహిళ లందరికీ వర్తిస్తాయని పేర్కొంటారు. చాలా ముస్లిం దేశాల్లో ఈ అభిప్రాయాన్నే అంగీకరిస్తారు. ఆయా దేశాల్లో ముస్లిం మహిళలు ఇంటికే పరిమితమవుతారు. తప్పనిసరైతే తప్ప ఇంటి బయటకు రారు.

వీటిని సమ్మతించే కొందరు ఖుర్‌ఆన్‌లోని మరికొన్ని వాక్యాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. బయటకు వెళ్లినప్పుడు మహిళలు తమను తాము పూర్తిగా వస్త్రంతో కప్పుకోవడం, స్త్రీలైనా పురుషులైనా పరాయి వారి ముందు తమ దృక్కులను కిందికి వాల్చడం లాంటి గౌరవాలను పాటించాలంటారు. దీని అర్థం... అలా పాటించేటప్పుడు అవసరాన్ని బట్టి చట్టబద్ధమైన పనులు చేయడానికి స్త్రీలు బయటకు వెళ్లవచ్చు. చదువుకోవడానికి, వైద్యం, నర్సింగ్, ఉపాధ్యాయ వృత్తిలాంటివి చేపట్టడానికి వారు బయటకు వెళ్లవలసిన అవసరం ఉందని వారు నమ్ముతారు. తోటి మహిళలకు సేవలందించడానికి ప్రత్యేకించి ఈ వృత్తుల్లో మహిళలు ఉండాల్సిన అవసరం ఉంది. దీన్ని బట్టి రెండు రకాల అభిప్రాయాలు వాడుకలో ఉండడం గమనించవచ్చు.

ప్రపంచంలో చాలా చోట్ల ముస్లిం సమాజాల్లో సామాజిక విందులు వినోదాలు అంటే కుటుంబవేడుకలే. లేదంటే స్త్రీలు, పురుషులు విడివిడిగా వేర్వేరు బృందాలుగా వేడుకల్లో పాల్గొనడం. స్త్రీ పురుషులు కలిసి విందులు, నృత్యాలతో వేడుకలు జరుపుకొనే పాశ్చాత్యులకు ముస్లింల వేడుకలు, వారి సామాజిక జీవనం ఉత్సాహభరితంగా అనిపించకపోవచ్చు. కాకపోతే పాశ్చాత్యుల లాగా కుటుంబం అంటే భార్యాభర్తలు వారి పిల్లలు మాత్రమే కాదు, ముస్లింల కుటుంబం చాలా పెద్దది. సోదరభావం వారి మధ్య చాలా దృఢంగా ఉంటుంది. బంధువులను సదా స్వాగతించే వారి స్వభావం, కమ్మని ఆతిథ్యం లాంటివి చూస్తే ఆనందించడానికి మందు, మగువల ఉనికి అవసరం లేదనిపిస్తుంది.

## బహుభార్యాత్వం

ఇస్లాం మతానికి సంబంధించి పాశ్చాత్య దేశాల్లో ఎక్కువగా గుర్తించేది బహుభార్యాత్వాన్ని. ఇక్కడ నేను ఒక విషయాన్ని స్పష్టంగా తెలియజేయదలచు కున్నాను. ఇస్లాంలో బహుభార్యాత్వమనేది అందరికీ వర్తించే తప్పనిసరి అంశం కాదు. ప్రవక్త కూడా తన వైవాహిక జీవితంలో చాలా కాలం పాటు ఏకపత్నీవ్రతుడిగానే ఉన్నారు. పాతికేళ్ల వయసులో ఆయన ఖదీజాను వివాహ మాడారు. ఆమె మరణించేనాటికి ఆయనకు 50 ఏళ్లు. అప్పటివరకు ఆయన ఏకపత్నీవ్రతులే. కాబట్టి ఎవరైనా కూడా ఒక పురుషుడు, ఒక స్త్రీ అన్న విధానానికే కట్టుబడి ఉండాలి. బహుభార్యాత్వం అనేది అరుదైన సందర్భాల్లోనే ఆచరించబడుతుంది.

కొన్ని చోట్ల, కొన్ని సందర్భాల్లో దీన్ని దుర్వినియోగం చేసినా, బహు భార్యాత్వం అనేది కొన్ని పరిస్థితుల్లో చాలా గొప్ప అంశంగా పరిగణించబడు

తుంది. అంటే సందర్భాన్ని బట్టి ఈ విధానం మంచి, చెడులు ఆధారపడి ఉంటాయి.

ఉదాహరణకు యుద్ధ సమయాలనే తీసుకుంటే ఎందరో స్త్రీలు, యువతులు భర్తలను, కాబోయే జీవితభాగస్వాములను కోల్పోతారు. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల్లో లక్షలాది మహిళలు ఇలా అనాథలయ్యారు. సంపాదించే భర్త అర్థాంతరంగా కన్నుమూస్తే రక్షణ లేక, పోషణ లేక భార్య, బిడ్డలు రోడ్డున పడక తప్పని పరిస్థితి... అలాంటి పరిస్థితుల్లో ఒక పురుషుడు ఒక్క స్త్రీనే పెళ్లి చేసుకోవాలన్న నియమం పాటిస్తే ఈ మహిళలంతా ఏమైపోతారు? కన్నబిడ్డల్ని పోషించడం కోసం వారు నానా కష్టాలు పడాల్సి వస్తుంది. ఆ క్రమంలో కొందరు తాత్కాలిక ఉపశమనం కోసం ఉంపుడు గత్తెలుగా మారతారు. అలాంటప్పుడు వారికి కానీ, వారి పిల్లలకు కానీ చట్టపరంగా ఎలాంటి రక్షణా ఉండదు. అటువంటి పరిస్థితిని ఏ మహిళా కోరుకోదు. ఎవరైనా కూడా చట్ట పరంగా రక్షణ ఉన్న భద్రమైన జీవితాన్ని కోరుకోవడం సహజం కదా.

ఈ నేపథ్యంలో బహుభార్యాత్వానికి అవకాశమిస్తే... అసలు భర్త లేకుండా, చట్టపరమైన ఎలాంటి రక్షణా లేకుండా ఉండే బదులు చట్టపరమైన రక్షణతో భర్తను మరో మహిళతో కలిసి పంచుకోవడానికి మహిళలు అంగీకరిస్తారన్నదే ఈ విధానం ఉద్దేశం. సమాజం గుర్తించి గౌరవించే అవకాశం ఉన్న విధానం ఇది. మొదటి భార్యకు తెలియకుండా రహస్యంగా నడిపే వ్యవహారం కాదు. కాబట్టి భయపడాల్సిన అవసరం లేదు. పైగా పిల్లలకు తండ్రి ఆస్తిలో చట్టపరమైన హక్కు లభిస్తుంది. తండ్రి రక్షణ ఉంటుంది.

పైగా బహుభార్యాత్వమనేది ఏదో ఒక రూపంలో యూరోప్,

అమెరికాల్లో  ఆచరణలో ఉందన్నది అందరికీ తెలిసిన సత్యమే. అక్కడ పురుషులకు మొదటి భార్యను మినహాయించి ఎంతమందితో సంబంధం ఉన్నా వారిపట్ల, వారి పిల్లల పట్ల ఎలాంటి చట్టపరమైన బాధ్యతలు ఉండవు. కానీ ముస్లిం పురుషులకు అలా కాదు. వారికి భార్యలందరి పట్ల, వారి పిల్లల పట్ల చట్టపరమైన బాధ్యతలు ఉంటాయి.

యుద్ధం కాకుండా ఇతర సందర్భాలు కూడా ఉండవచ్చు. వ్యక్తిగత పరిస్థితులు, ఇతర ప్రత్యామ్నాయాలతో పోలిస్తే ఒకరికన్నా ఎక్కువ స్త్రీలను పెళ్ళాడడం మంచి పరిష్కారంగా అన్పించే పరిస్థితులు... ఉదాహరణకు మొదటి భార్య దీర్ఘవ్యాధితో బాధపడటం, వికలాంగురాలవడం లాంటివి. ఇలాంటి పరిస్థితులను  ఎదుర్కొనగలిగే పురుషులూ ఉంటారు. అయితే దాని పర్యవసానాలను ఎవరూ కాదనలేం. అలాంటి కొన్ని సందర్భాల్లో రెండో పెళ్లి అందరికీ సమ్మతమైన పరిష్కారం కావచ్చు.

కొన్ని సందర్భాల్లో భార్యకు సంతానం కలిగే అవకాశం లేని పరిస్థితి ఉంటే భర్తకి సంతానమంటే చాలా  ఇష్టం ఉండవచ్చు.  పాశ్చాత్యులైతే అటువంటి పరిస్థితులతో రాజీ పడడమో లేక మరో పెళ్లి  చేసుకునేందుకు వీలుగా , విడాకులకు మార్గం వెదకడమో చేస్తారు. విడాకులతో మొదటి భార్య దిక్కులేనిది అవుతుంది. అలా కాక రెండో వివాహానికి  అవకాశముంటే, అంగీకరిస్తే మూడు పక్షాలకూ న్యాయం జరుగుతుంది.

కొన్ని సందర్భాల్లో వివాహబంధం సాఫీగా సాగదు. భర్త మరో స్త్రీని ఇష్టపడతాడు. ఎటర్నల్ ట్రయాంగిల్‌గా పేర్కొనే  ఇలాంటి పరిస్థితి చాలా మందికి తెలుసు.  భార్యకు విడాకులిస్తే కానీ ఇష్టపడిన ఆమెను వివాహం చేసుకోలేరు పాశ్చాత్య సమాజంలో. విడాకులకు మొదటి భార్య అంగీక

రించకపోవచ్చు. ఆమెకు భర్త మీద ప్రేమ లేకపోయినా, వివాహబంధంలో ఉండే భద్రత కోసం విడాకులు ఇష్టపడకపోవచ్చు. అలాగే రెండో మహిళ కూడా ఆ పురుషుడి కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఇష్టపడకపోవచ్చు. ఇలాంటి సందర్భాలలో ఇద్దరు మహిళలూ ఆ పురుషుడి రెండో వివాహానికి అంగీకరిస్తే... వివాహంలోని అసంతృప్తిని పోగొట్టి, చట్టబద్ధంగా, సమాజంలో గౌరవంగా జీవించే అవకాశం ఉంటుంది.

బహుభార్యాత్వానికి సంబంధించి ఈ ఉదాహరణలు ఎందుకు చెప్పానంటే పాశ్చాత్య దేశాల్లో ఇస్లాంలోని బహుభార్యాత్వం అంటే ఒక దురభిప్రాయం ఉంది. మనసుకు నచ్చిన వారిని ఎంతమందినైనా పెళ్లి చేసుకోవచ్చని మాత్రమే వారు భావిస్తుంటారు. కొన్ని అనివార్య సమస్యలకు పరిష్కారంగా దాని గురించి వారికి తెలియదు. ఈ విషయంపై ఇంతగా చర్చించడానికి కారణం... నేను దాని గురించి ప్రచారం చేయడం కోసం కాదు, ఇది మరో ఆలోచన లేకుండా ఖండించదగిన విధానం కాదని, దాని అవసరాలు ఏ సమాజంలోనైనా ఉన్నాయని చెప్పడానికే.

## సారాంశం

ఇప్పటివరకు చర్చించిన అంశాలను సంక్షిప్తంగా చెప్పాలంటే ఇస్లాం సమాజంలో మహిళల పాత్రను పాశ్చాత్య సమాజం పూర్తిగా అపార్థం చేసుకుంది. ఒక్క మహిళల పాత్ర అనే కాదు, సాధారణంగా ఇస్లాం విధానాలు, జీవనశైలి పట్ల వారిలో అవగాహనా లోపమే దీనికి కారణం. దానికి ప్రసార మాధ్యమాలు చేసే అభూతకల్పనలూ తోడయ్యాయి.

క్లుప్తంగా చెప్పాలంటే ముస్లిం మహిళలకు పురుషులతో సమానంగా ఆధ్యాత్మిక, మేధోపరమైన హక్కులు, అవకాశాలు అన్నీ ఉన్నాయి. జీవితమంతా

ఆమె తన మత ధర్మాన్ని ఆచరిస్తూ, మేధోపరమైన వికాసానికి కృషిచేసుకోవచ్చు. స్త్రీ పురుషుల మధ్య ఉండే సంబంధాల్లోనూ పరస్పరం హుందాగా ప్రవర్తించాలి. వస్త్రధారణ, ప్రవర్తనలకు సంబంధించి నియమాలను ఆచరించాలి. భర్తతో ఆమె అనుబంధం ప్రేమ, సానుభూతిలపై ఆధారపడి వుండాలి. భార్య, బిడ్డల పోషణ బాధ్యత పురుషునిదైతే, కుటుంబ యజమానిగా అతనికి ఇవ్వవలసిన గౌరవం ఇవ్వడం స్త్రీ బాధ్యత. ఇంటిని చక్కదిద్దుకోవడం, పిల్లలకు పిన్నవయసులో మంచి చెడు నేర్పాల్సిన బాధ్యతలు భార్యవే. ఆమె తన సొంత వ్యాపారం ఏదైనా ఉంటే చేసుకోవచ్చు. సొంతంగా ఆస్తి కలిగివుండవచ్చు. వారసత్వంగా ఆస్తి తెచ్చుకోవచ్చు. దానిపై ఆమె భర్తకు ఎలాంటి అధికారాలు ఉండవు.

ఆమె అనుమతి లేకుండా పెళ్లి చేసుకోవడం జరగదు. అలాగే వివాహబంధంలో కొనసాగడం ఇష్టంలేనప్పుడు విడాకులు పొందే హక్కు ఆమెకు ఉంది. పరిమితులకు లోబడి అనుసరించే బహుభార్యాత్వం వల్ల స్త్రీపురుషులిరువురికీ ఉపయోగాలున్నాయి. వీటన్నిటి కారణంగా జీవన చరమాంకంలో స్త్రీ గౌరవంగా, బాధ్యతాయుతమైన బిడ్డల, సమాజ సంరక్షణలో గడపగలుగుతుంది.

వీటన్నిటిని బట్టి చూస్తే మహిళలకు అవసరమైన స్వేచ్ఛ, భద్రతలు తగుపాళ్లలో ఇస్లామీయ వ్యవస్థ అందిస్తోందని అర్థమవుతుంది. తద్వారా సామాజిక ప్రయోజనాలూ నెరవేరుతున్నాయి. ఈ పుస్తకం మొదట్లో నాకెదురైన ప్రశ్నల గురించి చెప్పాను కదా.. వాటన్నిటికీ ఖురాన్, హదీసుల నుంచి సాధికార సమాధానాలను ఇచ్చాననే అనుకుంటున్నాను. ఇందులో పేర్కొన్న ఇస్లామిక్ ధర్మాలు, న్యాయాలు, నిబంధనలు ఎక్కడైనా... ఎప్పుడైనా... వక్రీకరించడం, వాస్తవ విరుద్ధ రూపంలో ఉపయోగించడం జరిగినట్లయితే అది కేవలం మనిషి స్వార్థం వల్ల జరుగుతున్నదే.

## చట్టాలలో, ధర్మాలలో లోపం కానేకాదు

అదృష్టవశాత్తూ ఖుర్‌ఆన్‌లో పేర్కొన్న అంశాలను ఎవరూ మార్చలేదు. మార్చలేరు కూడా. మహిళల రక్షణ కోసం 7వ శతాబ్దంలో రూపొందించి పొందుపరిచిన నియమాలను ఈ 21వ శతాబ్దంలోనూ పరిశీలించవచ్చు. మహిళలకు సంబంధించిన ఈ చట్టాలు, సామాజిక నిబంధనలు మౌలికమైన వాస్తవాలను ప్రతిబింబిస్తున్నాయి. దాంతో వాటిని ఆచరణలో ఉపయోగించే వారెవరైనా లబ్ధి పొందగలరనిపిస్తోంది . వనితల జీవన విధానం, వారి పాత్ర, హక్కుల గురించి ఇస్లామ్ దృక్కోణం నుంచి తాజాగా మరొకసారి పరిశీలించ డానికి ఇది సరైన సమయం కూడా అనిపిస్తోంది. ఎందుకంటే గత 14 శతాబ్దాలలో ఇస్లాం ప్రపంచవ్యాప్తంగా అటు అభివృద్ధి చెందిన నాగరిక, విద్యాధికులున్న దేశాల్లోనూ, ఇటు అభివృద్ధి చెందని దేశాల్లోనూ విశాలమైన, స్థిరమైన సమాజాలను నెలకొల్పగలిగింది. తన ధర్మాలను మొదటినుంచి ఒకే తీరుగా కొనసాగించగలుగుతోంది. పాశ్చాత్య సమాజం నేర్చుకోదగ్గ అంశాలు ఇందులో ఉన్నాయి.

# ఇస్లాంలో కుటుంబ జీవనం

విలువలు అనేవి పూర్తిగా తలకిందులవుతున్న పరిస్థితి నేటి సమాజానిది. తరతరాలుగా సమాజంలో కొనసాగుతున్న ఆచార సంప్రదాయాలన్నీ ప్రభావానికి లోనైనట్లే సమాజానికి మూలాధారంగా నిలబడే కుటుంబ జీవన వ్యవస్థపై కూడా ఆ ప్రభావం పడుతోంది. కొంతకాలం క్రితం 'ఆధునిక యుగ మార్గదర్శకులం' అనుకున్న యువత 'గుంపులు'గా జీవిస్తూ భాగస్వాములను, పిల్లలను, సంపాదనని పంచుకుంటూ బతకడం ఫ్యాషన్‌గా భావించింది. అది చూసి చాలామంది కుటుంబ వ్యవస్థ అంతమైపోతుందేమోనని భయపడ్డారు. అదృష్టవశాత్తూ అలా జరగలేదు. ఇప్పటికీ అధికశాతం యువతులు చేతికి కల్యాణపు ఉంగరం పెట్టుకోవడం గురించి కలలు కంటున్నారు. ఫలానావారి శ్రీమతిగా సౌకర్యవంతమైన కుటుంబ జీవితం గడపడం గురించి, పిల్లల్ని క్రమశిక్షణతో పెంచడం గురించి కలలు కంటున్నారు. యువకులు కూడా ఈమె నా భాగస్వామి లేదా కామ్రేడ్ అని కాక..... 'ఈమె నా భార్య' అని గర్వంగా చెప్పుకోవడాన్ని ఇష్టపడుతున్నారు. మనకు తెలియని కాలం నుంచి మానవ సమాజంలో వేళ్లూనుకొని వున్న కుటుంబ జీవన విధానాన్ని సోషలిజం కానీ మరే ఇజాలు కానీ ఏమీ చేయలేకపోయాయి.

ఆధునికత వెర్రితలలు వేసిన పాశ్చాత్య దేశాల్లోనే కుటుంబం, వివాహ బంధాలు అన్నిటినీ తట్టుకుని నిలబడగలిగినప్పుడు ఇక ముస్లిం ప్రపంచంలో వాటికి తిరుగేముంది? ఇక్కడ, కుటుంబ వ్యవస్థ భర్త, భార్య, పిల్లలు మాత్రమే

కాదు మొత్తం బంధువర్గంతో సహా సంప్రదాయపరంగానూ, మతపరంగానూ ఎలాంటి బయటి ప్రభావాలకూ లోనుకాకుండా పటిష్ఠంగా ఉంది.

## ఇస్లామీయ విధానం

ఆరోగ్యకరమైన, ఆనందకరమైన కుటుంబ జీవనాన్ని చట్టాలు ఇవ్వలేవని కొందరు అంటుండవచ్చు. అది నిజమే. కుటుంబ సభ్యులందరూ మంచితనంతో ఉంటేనే ఆనందం. అది లేనప్పుడు ఎన్ని ఉత్తమ చట్టాలైనా కాగితం మీద రాసిన వాక్యాలుగానే మిగిలిపోతాయి. అయితే ఇస్లామ్ జీవన విధానంలో మిగిలిన అంశాల్లాగే ఇక్కడ కూడా రూలింగ్ ఫ్యాక్టర్ ఏమిటంటే... ఇస్లాం అనేది పాశ్చాత్యుల భావనలో లాగా ఒక మతం కాదు. దాన్ని విశ్వసించే వారికి అదొక జీవన శైలి. అంటే నిత్య జీవితాన్నుంచి అసలు విడదీయలేని విషయం. ఇస్లాం అంటే ఒక రకంగా మనిషి తనను తాను సంపూర్ణంగా దైవానికి(విల్ ఆఫ్ గాడ్) సమర్పించుకోవడం. మరో విధంగా దైవం ఈ భూమ్మీద మనిషికి విధించిన నియమాలను సంపూర్ణంగా సమ్మతించడం.

దేవుని అభిమతానికి (విల్ ఆఫ్ గాడ్) సమర్పించుకోవడం. దీన్ని కుటుంబ జీవనానికి వర్తింపజేస్తే- మనిషి సహజ స్వభావంలో ఉండే వాంఛల్ని అంగీకరించి వాటిని నెరవేర్చుకునే దిశగా జీవించడం. ప్రేమ, పరస్పరం నమ్మకం, దయ, త్యాగం, సాంత్వన లాంటివన్నీ పంచుకోగల భాగస్వామిని పొందాలన్న కాంక్ష. పిల్లలు కావాలన్న ఆకాంక్ష, తల్లిదండ్రులు, తోబుట్టువులు, బంధువులు... అందరూ కావాలనుకోవడం, మనని సంరక్షించేవారు, మన సంరక్షణ కోరుకునేవారు, మనశ్శాంతి, సాంత్వన లభించే ఇల్లు కోరుకోవడం... మంచి విద్య పొందాలనుకోవడం... అవసరం వచ్చినపుడు తగిన సాయం పొందాలనుకోవడం... ఇతరులకు మంచి చేయడం, మనకూ మంచే

జరగాలనుకోవడం.. సందర్భానికి తగినట్లుగా మసలుకోవడం.. ఇవన్నీ.

మనిషికి ఈ భూమి మీద దైవం అప్పగించిన విధులు నిర్వర్తించడం అన్నిటికన్నా ముఖ్యం. అందుకు సహకరించేది మంచి కుటుంబజీవనం. ఆరోగ్యకరమైన, మంచి కుటుంబం జీవితం పట్ల సరైన దృక్పథం అలవడడానికి దోహదం చేస్తుంది. విషయాలను సరైన కోణంలో చూసేలా తోడ్పడుతుంది. ఉపయోగకరమైన విద్యనందిస్తుంది. ఉద్యోగం కోసమే కాక జీవితాన్ని కూడా తీర్చిదిద్దుకునే శక్తినిచ్చే విద్యనిస్తుంది. భద్రమైన ఇంటినిచ్చి , సమాజంలో మన పాత్రను నిర్వహించగలిగేందుకు తోడ్పడుతుంది. వృద్ధులమయ్యాక మన బాగోగులు చూసుకునే ఏర్పాటు చేస్తుంది.

పాశ్చాత్య సమాజంలో నేటి జీవనవిధానాన్ని చూసిన, అలవాటుపడిన వారికి ఇది అసాధ్యంగా అన్పించవచ్చు. పిల్లల్ని శిశు సంరక్షణాలయాల్లో వదిలేయవచ్చు, విద్యాబుద్ధులకు పాఠశాలమీద ఆధారపడవచ్చు.. ఎన్నో పన్నులు కడుతున్నప్పుడు ఈ బాధ్యతలన్నీ మనమే ఎందుకు చేపట్టాలి? ఎవరి జీవితాలు వారివి, ఎవరి తిప్పలు వారు పడతారు, బంధువులందరినీ పట్టుకుని వేళ్లాడాల్సిన అవసరం ఏముంది? వృద్ధులకు శరణాలయాలున్నాయి కదా, వృద్ధుల సంరక్షణ బాధ్యత ఎందుకు? పిల్లల్ని, వృద్ధుల్ని, అనారోగ్యంగా ఉన్న కుటుంబ సభ్యుల్ని... వీళ్లని చూసుకుంటూ కూర్చునే బదులు చేయడానికి ఎన్నో ఆకర్షణీయమైన పనులున్నాయి కదా.... అని వారు భావించవచ్చు.

నిజమే, అసాధ్యం, అనవసరం... అన్పించినా, ముస్లిం ప్రపంచంలో ఇప్పటికీ ఈ బాధ్యతలన్నీ అత్యధికంగా కుటుంబాలే చేపడతాయి. ఆధునిక, సాంకేతిక, పారిశ్రామిక ప్రగతి ఎంతగా ముందుకువెళ్లినా ఈ ఇస్లామ్ విధానాలు కాలం చెల్లిన పద్ధతులు అయిపోలేదు. ఇప్పటికీ ముస్లింలు వాటిని


చాలా ప్రాధాన్యమైన అంశాలుగానే పరిగణిస్తున్నారు. ఎందుకని అలా? ఎందుకంటే నేననుకుంటాను... భూమ్మీద తమ ప్రవర్తనకు చివరిరోజున సంపూర్ణ బాధ్యత వహించాలని ముస్లింలు నిజాయతీగా నమ్ముతారు. తమ పాత్రగురించి వారికి బాగా తెలుసు. మతపరమైన ధర్మాలను నెరవేర్చడంలో వారు సంతృప్తిని అనుభూతి చెందుతారు. తమ జీవితానికి అదే పరమార్థమని భావిస్తారు. తద్వారానే దేవుని కృపకు పాత్రులవుతామనుకుంటారు.

ఆధునిక కాలంలోనూ మతం జీవితంపైన ఇంత శక్తిమంతమైన ప్రభావం చూపిస్తుందా అని ముస్లిమేతరులు ఆశ్చర్యపోవచ్చు. ఇతర రంగాల్లో లాగా ఇక్కడ పాశ్చాత్య ఉదాహరణలను అనుకరించడం జరగకపోగా వాటిని తిరస్కరించడం జరుగుతోంది.

## ముస్లిం కుటుంబ నిర్మాణం

ఇస్లామ్ చూపే కుటుంబ నిర్మాణమే చాలా బలమైంది. నాలుగు ప్రధాన స్తంభాల్లాంటి అంశాలు ఈ నిర్మాణానికి పునాదులు. అవే ఈ కుటుంబ వ్యవస్థకు ఆధునిక పోకడలను తట్టుకుని నిలబడే శక్తి నిస్తున్నాయి. అవన్నీ కూడా ఖుర్‌ఆన్‌లోని నియమాలు, ముహమ్మద్ ప్రవక్త జీవితంలోని సంప్రదాయాల నుంచి మొదలై ఒక తరం నుంచి మరో తరానికి వంశపారంపర్యంగా సంక్రమిస్తున్నాయి.

1. మానవ సమాజానికి ఊయలలా ఉపయోగపడుతుంది కుటుంబ జీవితం. పెద్దలకు, పిల్లలకు కూడా అది ఒక భద్రమైన, ఆరోగ్యకరమైన ఇంటిని ఇస్తుంది.
2. స్త్రీ, పురుషుల సహజమైన, శారీరక వాంఛలు నెరవేర్చుకోవడానికి అవసరమైన రక్షణనిస్తుంది కుటుంబ జీవితం.
3. మానవీయ విలువలైన ప్రేమ, దయ, కారుణ్యం లాంటి వాటిని బాల్యంలోనే మనసుల్లో పాదుకొల్పి పెంచి పోషించే స్థలం కుటుంబం.
4. లోపలి, బయటి కష్టాలనుంచి మనిషిని కాపాడుతూ భద్రమైన ఆశ్రయాన్నిచ్చే చోటు కుటుంబం.



**మొదటి స్తంభం:** ఇల్లు, ప్రోత్సాహం

**రెండవ స్తంభం:** ప్రేమ, పిల్లలు

**మూడవ స్తంభం:** సహానుభూతినిచ్చే విలువలు (సింపాతెటిక్ వర్ట్యూస్)

**నాలుగో స్తంభం :** ఆశ్రయం

## నాలుగో స్తంభం: ఆశ్రయం

ఇస్లామిక్ కుటుంబానికి సంబంధించి ఎప్పుడూ ఒకేలా విలువకలిగి, ఏనాడూ పరిధులు దాటని కోణం ఏమిటంటే... వ్యవస్థనుంచి లభించిన ఈ నాలుగు స్తంభాల బలం. ఇక్కడ మర్చిపోకూడని మరో విషయం ఏమిటంటే కుటుంబ జీవితం తాలూకు ప్రయోజనాలు కేవలం రక్తసంబంధీకులకే పరిమితం కాదు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లిం కుటుంబాలకు, మొత్తంగా ముస్లిం సోదరులకు అది వర్తిస్తుంది.

ఈ నాలుగు స్తంభాల గురించి ఇప్పుడు మరింత వివరంగా చర్చిద్దాం.

## 1. మానవ సమాజానికి ఊయలగా కుటుంబం

మొత్తం మానవ సమాజానికి కుటుంబాన్ని ఊయలగా పరిగణించి నప్పుడు మానవజాతిని ముందుకు తీసుకెళ్లే పిల్లలకు అక్కడ వారి సర్వతోముఖ వికాసానికి అవసరమైన పరిపూర్ణమైన విద్య లభించాలి. అందుకు గాను వారికి మంచి తల్లి కావాలి. ఆమె బిడ్డల సంరక్షణను పార్ట్ టైమ్ ఉద్యోగంలా కాక తన ప్రథమ కర్తవ్యంగా భావించి నిర్వహించాలి. ఇస్లాం పితృస్వామ్య స్వభావానికి తగినట్లుగా వారికో తండ్రి ఉండాలి. అతను కుటుంబానికి పెద్దగా వ్యవహరించాలి. కుటుంబానికి సంబంధించి మతపరమైన బాధ్యతంతా అతని భుజస్కంధాలమీద ఉంటుంది. సయ్యద్ అబుల్ అలా మౌదూదీ ఈ విషయాన్ని ఎంతో అందంగా ఇలా వివరించారు... అతను దైవ విశ్వాసాన్ని పెంపొందిం

చాలి. కుటుంబంలో అతని అధికారం ప్రపంచంలో దైవానికున్న అధికారానికి ప్రతీకలా ఉండాలి. అతను నిర్వహించే ఈ పవిత్ర బాధ్యతల వల్లనే కుటుంబ పెద్దగా అతనికి లభించే గౌరవం. ఇస్లామిక్ సమాజంలోని కొన్ని ప్రాంతాల్లో మహిళల తిరుగుబాటు చోటుచేసుకోవడానికి కారణం పురుషులు తమ ఈ ధర్మాలను, పితృస్వామ్య విధులను నిర్వహించడంలో విఫలమవడమే...

తల్లీ, తండ్రీ తమ అత్యంత ప్రధానమైన ఈ బాధ్యతల గురించి బాగా తెలిసి ఉండి, రేపటి ప్రపంచం ఇవాళ తాము తమ పిల్లల్ని తీర్చిదిద్దడంపైనే ఆధారపడివుందని అర్థం చేసుకుని నడుచుకునే ఇంట్లో సమాజానికి సంబంధించిన పునాది పటిష్ఠంగా నిలిచివుంటుంది.

పిల్లల చదువు విషయానికి వస్తే నా అభిప్రాయం ప్రకారం అది నాలుగు దశలుగా సాగాలనుకుంటాను. పుట్టినప్పటినుంచి ఇంటిని వదిలివెళ్లే ఇరవయ్యేళ్ల వయసు వరకు కుటుంబంలో ఇస్లామ్ భావజాలం నేపథ్యంలో, ఆ వాతావరణంలో సాగాలి. ఆధునిక మనస్తత్వ శాస్త్రం చెప్పినట్లుగా ఈ వాతావరణం పిల్లల బాల్యంలో వారి ఎదిగే మనసుపై చెరగని ముద్ర వేస్తుంది. ఈ వాతావరణంలో ఎన్నో పెద్ద, చిన్న సంగతులుంటాయి. అన్నిటికన్నా ప్రధానమైనది తల్లిదండ్రులు ఒకరినొకరు ప్రేమిస్తారు, గౌరవిస్తారు. ఓపిక, సహనంతో ఉండి పిల్లలను పోషిస్తారు. అలాగే వీనుల విందుగా సాగే ఖుర్‌ఆన్ వాక్యాలను కూడా పిల్లలు వినాలి. ఈరోజుల్లో చక్కటి రికార్డులు కూడా లభిస్తున్నాయి. వీటిని వింటే పిల్లలకు చాలా విషయాలు తెలుస్తాయి. రమజాన్ పర్వదినాల గురించి, ఉపవాస దీక్ష, స్నేహితులు, బంధుమిత్రుల కలయిక, పండుగ జరుపుకోవడం... లాంటివన్నీ తెలుస్తాయి. ప్రేమపూర్వక స్వరంలో అల్లాహ్, ముహమ్మద్ లాంటి పదాలను వారు వినాలి. ఇదంతా మనలో చాలా మంది చేస్తున్నదే. ఇస్లామీయ వాతావరణమంటే ముస్లిం ఇంట్లో కొన్ని అయినా

ఇస్లామిక్ వస్తువులు ఉండాలి. మామూలు చౌకబారు సెంటిమెంటల్ వస్తువులు కాదు నేను చెప్తున్నది, నిఖార్సైన ఇస్లామ్ సంస్కృతిని ప్రతిబింబించే వస్తువులు. చక్కని కాలిగ్రఫీతో ఉండే సందేశాలను గోడలకు అలంకరించడం పిల్లలు చూడాలి. చక్కటి తివాచీలు... పాశ్చాత్యుల ఇళ్లలో కన్పించని వస్తువులు ఉండాలి. ముస్లింలు కనీసం ఇళ్ల దగ్గర అయినా సంప్రదాయ దుస్తులు ధరించాలి. ఇంట్లోకి వస్తూనే పాదరక్షలు తొలగించాలి. ఇలాంటివి పాటించడం వల్ల తమ సంస్కృతికి దగ్గరగా ఉన్నవారవుతారు. పిల్లలు కూడా ఆ వాతావరణంలో పెరగడం వలన తాము ముస్లింలమన్న భావన వారిలో నెలకొంటుంది. అందుకు వారు గర్వపడతారు. ఆత్మవిశ్వాసంతో మెలగుతారు.

## విద్య

నా దృష్టిలో రెండో దశ అనేది 'చెప్పడం'(టెల్లింగ్). పిల్లలు చిన్న వయసులో ఎలాంటి కథలు వినడం వలన వారిలో ఎలాంటి వ్యక్తిత్వం రూపొందుతుందో శాస్త్రవేత్తలు చెప్పడం మనం చూస్తూనే ఉన్నాం. ఆహ్లాదకరమైన కథలు చెప్తే వారిలో సృజనాత్మకత మొగ్గతొడిగి రెక్కలు విచ్చుకొంటుంది. ఇప్పుడు తల్లిదండ్రుల ముందు మరో విస్తారమైన అంశం ఉంది. వారు ఖుర్‌ఆన్‌కి సంబంధించి, ప్రవక్తలకు సంబంధించి, ఇస్లామ్ చరిత్రలోని కథా నాయకుల గురించి మరోసారి చదవవచ్చు. చదివి వాటన్నిటినీ ఆసక్తికరమైన, స్ఫూర్తిదాయకమైన కథలరూపంలో పిల్లలకు చెప్పాలి. సాధారణంగా నాకు తెలిసి రెండు నుంచి ఐదేళ్ల లోపు పిల్లలు రకరకాల కథలు వినడానికి ఆసక్తి కనబరుస్తారు. ఇంటి దగ్గర తల్లి తన పనులు చేసుకుంటూనే పిల్లలకు ఈ కథలు చెప్పవచ్చు. అలా చెప్పేటప్పుడు చాలా సందర్భాల్లో మంచి చర్చలు చోటుచేసుకుంటాయి. పిల్లలకు ఎన్నో సందేహాలు వస్తుంటాయి. వాళ్ళు ఆ సందేహాలను

అడగడం, తమ అభిప్రాయాలను చెప్పే ప్రయత్నం చేయడం వల్ల మనం చెప్ప దలచుకున్న అంశం మరింత ప్రభావవంతంగా వారి హృదయానికి హత్తు కునేలా చెప్పగలం. ఈ విధంగా పిల్లల్లో చక్కటి వ్యక్తిత్వం, ప్రమాణాలు రూపు దిద్దుకుంటాయి. అవి జీవితాంతం వారిని వెన్నంటే ఉంటాయి.

## ఇస్లామిక్ బాధ్యతలు

ఇక మూడో దశకు వస్తే అవి ఇస్లామిక్ బాధ్యతలు. తల్లిదండ్రులు ప్రార్థన చేస్తుంటే పిల్లలు అనుకరించడం సర్వసాధారణం. అప్పుడు వారికి కూడా ప్రార్థన సమయంలో పరుచుకునే ఒక చిన్న తివాచీ ఇవ్వాలి. కొత్తలో కొద్ది నిమిషాలు మాత్రమే వారు నిశ్శబ్దంగా ఉండగలుగుతారు కానీ రాను రాను అలవాటు పడతారు. ఇస్లాంలో రోజూ ఒక పద్ధతి ప్రకారం ప్రార్థన చేయడమనే నిత్యకర్మ వారికి అలవడుతుంది. అలాగే ఉపవాస దీక్ష కూడా. కొత్తలో పిల్లలు కొన్ని గంటలు మాత్రమే దీక్ష ఉండగలుగుతారు. నిదానంగా సగం రోజు, ఆ తర్వాత పూర్తి రోజు ఉపవాసం ఉండగలగడం వారికి చేతనవుతుంది. ఆ సమయంలో వారికి సహర్, ఇఫ్తార్ భోజనాలను కాస్త వేడుకగా జరపడం అవసరం. తల్లిదండ్రులతో పాటు తాను కూడా ఉపవాసదీక్ష మొదలుపెట్ట డానికి పొద్దున్నే లేచి ఆహారం తీసుకోవడం వారికి గర్వకారణంగా ఉంటుంది. ముస్లింగా తన కర్తవ్యం నెరవేరుస్తున్నానన్న తృప్తి వారికి కలుగుతుంది. పిల్లలు తమంతట తామే ఉపవాసం ఉంటామని తల్లిదండ్రులను అడుగుతారు. చాలామంది తల్లిదండ్రులకు ఇది అనుభవమేనని నాకు తెలుసు. అలాగే దానం ఇచ్చే అవకాశాల గురించి కూడా వారికి ఇప్పుడే తెలుస్తుంది. పిల్లలకు కొంత మొత్తం ఇచ్చి అది వారినే ఖర్చుపెట్టమని చెప్పాలి. అందులోనుంచి కొంత పేదలకు, ఆపన్నులకు ఇవ్వాలని వారికి తెలియజెప్పాలి. మసీదులోని కలెక్షన్

బాక్సులో వేయించినా సరే. మొత్తం డబ్బంతా బొమ్మలో, చాకొలెట్లో కొనుక్కోవ డానికి ఉపయోగించే బదులు ఇలా చేయడం ఎంత మంచి పద్ధతో వారికి అర్థమయ్యేలా చెప్పాలి. ఇక హజ్ యాత్ర విషయానికి వస్తే అలాంటి యాత్రల వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరులంతా పవిత్ర ప్రదేశాల వద్ద గుమికూడడం, వారి మధ్య సౌభ్రాత్ర భావన పెంపొందించుకోవడం, సృష్టికర్తను ఆరాధించడం... ఈ సంప్రదాయం ప్రవక్త ఇబ్రహీం(అ) సమయం నుంచి నిరాటంకంగా జరుగుతూ వస్తున్నదే.

ఈ విషయాలన్నీ తెలుసుకునే సరికి పిల్లల్లో తాము ముస్లింలమన్న భావన బలంగా నాటుకుంటుంది. వారి చదువుకు సంబంధించి నాలుగో దశ విశాలంగా ఏర్పడిన ఈ పునాది మీద బలంగా నిలబడుతుంది.

మౌలికమైన ఇస్లామిక్ విద్యకు సంబంధించి ఇంట్లోనూ కుటుంబం లోనూ చోటుచేసుకునే ఆ నాలుగు దశలూ ఏమిటంటే... జిహాద్ (దైవ మార్గంలో ప్రయత్నం), విధులు, కథలు - సంప్రదాయాలు, ఇస్లామిక్ వాతావరణం.

## జీవితం కోసం శిక్షణ

ఇది జిహాద్ దశ. పదిహేనేళ్ల వయసు వచ్చేసరికి పిల్లలకు జీవితం పట్ల ఒక అవగాహన ఏర్పడుతుంది. భూమి మీద జీవితమంటేనే ఒక పరీక్ష అని, దైవానికి తమను తాము సమర్పించుకోవడం ద్వారా (విల్ ఆఫ్ గాడ్) వారు విజేతలవుతారని అర్థమవుతుంది. సాధారణంగా ఇది మనిషికి అంతర్లీనంగా ఉంటుంది. ప్రత్యేకించి ఉత్సాహం ఉరకలు వేసే యువతలో అయితే జీవితా నికి ఏదో ఒక పరమార్థం, ఒక లక్ష్యం ఉండాలన్న తపన ఉంటుంది. వారు వాటిని సాధించాలన్న ఆశయంతో ముందుకు వెళ్తుంటారు. రోజువారీ

జీవితంలో మతపరమైన ధర్మాలను నిర్లక్ష్యం చేయకుండా అనుసరించడం, పాఠశాలలో పరీక్షలు ఉత్తీర్ణులవడం, అనారోగ్యాన్ని అధిగమించడం, ఉపయోగకరమైన ఉద్యోగం సంపాదించడం, ప్రేమించే భాగస్వామిని పొందడం, పిల్లల్ని మంచి పౌరులుగా పెంచడం.. ఇవన్నీ కూడా జీవితం సాఫీగా సాగిపోవడానికి ఉపకరించే వ్యక్తిగత విజయాలే. మంచి ఆకాంక్ష ఉన్నతాశయం దిశగా నడిపిస్తుంది. ఇక్కడ వారిని సరైన మార్గంలో నడిపించకపోతే వారు సమాజంలోని ప్రమాదకరమైన వ్యక్తుల బారిన, రకరకాల ఇజాల బారిన పడే ప్రమాదముంది.

జిహాద్... ధర్మం కోసం ప్రయత్నం, సంఘర్షణ... ఇది ప్రతి ముస్లింకీ తమ తమ స్వభావానికి, ప్రతిభకు తగిన విధంగా పనిచేసే రంగాన్ని ఎంచుకునే అవకాశం కల్పిస్తుంది. అవసరమైన విధంగా ఈ సంఘర్షణ చేయాల్సి వుంటుంది. చేత్తో, లేదా కలంతో. రైతు పారతో... వైద్యుడు స్కెతస్కోపుతో. కుట్టు మిషన్‌తో... లేదా కూర గరిటెతో. ఇస్లాంకి వ్యతిరేకంగా పనిచేసే అన్ని శక్తులకు వ్యతిరేకంగా చేసే పోరాటమే జిహాద్. ఆ శక్తులు ఇస్లాంను బలహీనం చేయడానికో, విమర్శించడానికో, ఇస్లాంను తక్కువ అంచనా వేయడానికో... ఇలా ఎందుకైనా పనిచేయవచ్చు. వాటిని తీవ్రంగానే పరిగణించాలి ఎందుకంటే అవి ఇస్లాం వారసత్వాన్నే నాశనం చేయడానికి పూనుకున్నాయి.

ఈ స్ఫూర్తి ఏ ఇంట్లో అయితే సదా సజీవంగా ఉంటుందో అలాంటి కుటుంబాలే పటిష్ఠమైన ముస్లిం సమాజానికి మూలస్తంభాలవుతాయి. కుటుంబ జీవనం ప్రధానోద్దేశాల్లో ఇదీ ఒకటి. మానవ సమాజం భవిష్యత్తు దీనిపై ఆధారపడి వున్నందున కుటుంబ జీవితంలో విద్యకు సంబంధించిన ఈ అంశానికి ప్రాముఖ్యమివ్వాల్సి ఉంటుంది.

# 2. వ్యక్తి ఆకాంక్షల రక్షణకు కుటుంబం

కుటుంబ జీవనానికి సంబంధించి రెండో స్తంభం వద్దకు వద్దామిప్పుడు. ఇందులో కుటుంబ జీవనం వ్యక్తికి ఉండే సహజ ఆకాంక్షలు, వాంఛలు నెరవేరే రక్షణ వ్యవస్థను కల్పిస్తుంది. ముహమ్మద్ ప్రవక్త (సఅసం) ఏమన్నారంటే... 'వివాహం నా సంప్రదాయం. నా మార్గం నుంచి దూరంగా వెళ్లిపోయే వారు మనలో ఒకరు కాజాలరు'. ఖుర్‌ఆన్‌లోనూ సురా 2, ఆయత్ 187లో పురుషులకు ఇలా చెప్పబడింది... 'వారు మీకు దుస్తులు, మీరు వారికి దుస్తులు'. ఇస్లాం సంపూర్ణ జీవనవిధానం కావడంతో పెళ్లితో సహా మనిషి సహజ కోరికలన్నిటినీ పరిగణనలోకి తీసుకుంటుంది. అంతేకాక దాని అర్థాన్ని మంచి మాటల్లో మనకు వివరిస్తుంది. భార్యాభర్తలు ఒకరికొకరు దుస్తుల్లా రక్షణనివ్వాలని, వారి వారి శారీరక కోరికలను తీర్చుకోవాలని, సంతానం పొందడం, ప్రేమ ఆప్యాయతలను పంచడం ఇవన్నీ కుటుంబ జీవనంలో భాగమని చెప్తుంది. ఇక్కడ నా సొంత అభిప్రాయాలు కొన్ని చెప్పాలనుకుంటున్నాను. ఇస్లాం మతాన్ని స్వీకరించిన వ్యక్తిగా తరచు నేను ఒక ప్రశ్న ఎదుర్కొంటాను... ఇస్లాంలో వివాహ వ్యవస్థ గురించి.

## పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు

ముస్లిం కుటుంబాల్లో ఉన్న పెద్దలు కుదిర్చే పెళ్లిళ్ల విధానాన్ని నేను బాగా గమనించాను. ఇది చాలా బాగా పనిచేయడం, నాకు ప్రశంసనీయమనిపిస్తుంది. ఒక ముస్లిం దేశంలో నేను నివసించినప్పుడు, మాజీ విద్యార్థులు, 15 ఏళ్లకు పైబడి నాకు మిత్రులుగా ఉన్న ముస్లింలు... అందరిలోనూ నేను గమనించినదేమిటంటే సగటు పాశ్చాత్య కుటుంబాలలోకన్నా ఇస్లాంలో పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్ల ద్వారా వివాహబంధం చిరకాలం నిలబడుతోంది.

ఇక్కడ తల్లిదండ్రులు, బంధువులు ఎంతో అనుభవంతో, దూరదృష్టితో పెళ్లి ప్రతిపాదనలు తెస్తారు. తగిన సంబంధాలు కుదురుస్తారు. ఇలా కుదిర్చే ముందు ఎన్నో అంశాలను వారు దృష్టిలో పెట్టుకుంటారు. కుటుంబ నేపథ్యం, విద్య, ఆశయాలు, ఇష్టాయిష్టాలు లాంటి ఎన్నో అంశాలను చూస్తారు. ముస్లిం వివాహాలన్నీ ఇలా పెద్దలు కుదిర్చినవే అయ్యుంటాయి. భాగస్వాములిద్దరూ ఒకరినొకరు చూసుకుని ఇష్టపడడం ఉండదు. ఇక పాశ్చాత్యుల్లా సెక్సువల్ కంపాటిబిలిటీ గురించిన ప్రశ్నే ఇక్కడ ఉదయించదు. అయినా సరే వారికన్నా ముస్లింలలోనే వివాహ వ్యవస్థ విజయవంతంగా కొనసాగుతోంది.

## బహుభార్యాత్వం

ఈ బహుభార్యాత్వం అనేది మాత్రం కొంచెం వివాదాస్పదమైన వ్యవహారం. యూరోపియన్ ముస్లిం వ్యక్తితో నా వివాహం జరిపించేటప్పుడు ఆ రిజిస్ట్రార్ నన్ను హెచ్చరించాడు. మేము ముస్లిం దేశంలో నివసించినట్లయితే నా భర్తకు నలుగురిని వివాహమాడే అవకాశం ఉందని గుర్తు చేశాడు. అది విని మొదట నేను నిర్ఘాంతపోయిన మాట వాస్తవం. కానీ ఒకరి కన్నా ఎక్కువ మంది భార్యల్ని కలిగివుండడం ఆమోదయోగ్యమే అయినా ఆచరణలో అది అరుదుగానే జరుగుతుందని కొన్నాళ్లకే అర్థమైంది. ఈ అధికారిక అనుమతి వల్ల కొంతమంది పురుషుల్లో సహజంగా ఉన్న కోరిక తీరినా, మొదటి భార్య అనారోగ్యమో, పిల్లలు కలగకపోవడం వల్లనో మరో భార్యను చేసుకున్నా... దీనివల్ల వివాహేతర సంబంధాలు పూర్తిగా నిషిద్ధమని తెలిశాక నాకిదే తెలివైన పని అనిపించింది. ఏ ముస్లిం పురుషుడైనా ఏదో ఒక కారణంతో మరో స్త్రీని ఇష్టపడితే దాని తాలూకు బాధ్యతలనన్నిటినీ భరించడానికి అతడు సిద్ధపడ తాడు. ఆమెను చట్టపరంగా భార్యగా చేసుకోవడం, పోషించడం, ఆమె బిడ్డల్ని కూడా మొదటి భార్య బిడ్డలతో సమానంగా చూడడం, అందరికీ తన

సమయాన్ని, రక్షణని, ఆస్తిని సమంగా ఇవ్వడం ఇవన్నీ ఇస్లాం న్యాయానికి కట్టుబడి చేస్తాడు. వీటికి సిద్ధపడినప్పుడే ముందుకు అడుగు వేస్తాడు. అలా కాకుండా పాశ్చాత్యులలాగా మోజు తీర్చుకుని ముఖం చాటేయడం ఇక్కడ సాధ్యం కాదు. ఇలాంటి సంఘటనలు, అలాంటి మహిళలు, వారి పిల్లలు పడే వెతలు మనకు తెలియనివి కావు.

## విడాకులు

మూడోది విడాకుల విషయానికి వస్తే ఇస్లామ్ చూపే పరిష్కారాన్ని నేను అన్నిటికన్నా మిన్నగా, నాకు తెలిసినవాటన్నిటిలోకి ఉత్తమమైనదానిగా గుర్తిస్తాను. విడాకుల వరకూ వెళ్లడం చాలా తక్కువ. అరుదుగానైనా ఒకవేళ తాము భార్య, భర్తలుగా ఇక కొనసాగలేమనుకుంటే వారిని బలవంతంగా కట్టివుంచే సంకెళ్లేమీ లేవు. సామరస్యపూర్వకంగా వారు విడిపోవచ్చు. మరొకరిని వివాహమాడి జీవితాన్ని సంపూర్ణంగా ఆస్వాదించవచ్చు. భర్త మరో భార్యను పెళ్లిచేసుకోవడం ఇష్టం లేనప్పుడు ఆ భార్య తప్పనిసరిగా విడాకులు తీసుకోవచ్చు. ఆమె గౌరవానికి భంగం కలగడమనేది ఎక్కడా జరగదు. ఆమెకు ఇష్టం లేదని భర్త తనకు నచ్చిన మరో స్త్రీతో రహస్యంగా గడపడం, ప్రతిసారీ భార్యకు నోటికొచ్చిన అబద్ధాలు చెప్పవలసి రావడం, తన వెనక ఏం జరుగుతోందో తెలిసీ తెలియనట్లు నటించే బాధ ఆమెకు, ఆమె ఒప్పుకోవడం లేదని హింసించే అవసరం పురుషుడికి ఉండవు. సింపుల్‌గా ఇద్దరూ ఒకరి నుంచి ఒకరు దూరంగా విడిపోతారు. దీనివల్ల మానవ సమాజం మరింత పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉంటుందని నేను భావిస్తాను. ఇళ్లు భార్యాభర్తల మధ్య తగవులతో పిల్లలకు నరకాన్ని తలపించవు. ఈ విడాకులకు సంబంధించే మరింత సున్నితమైన, అర్థవంతమైన నియమాలు ఎన్నో ఉన్నాయి. విడాకులు పొందిన మహిళ, ఆమె బిడ్డల ఆర్థిక పరిస్థితి గురించి కానీ, మరొకందుకు

గానీ అవన్నీ ఇక్కడ చర్చించడం ఇప్పుడు అసాధ్యం. 'చట్టం అనుమతించిన అన్ని అంశాల్లోకి విడాకులే దైవం అన్నిటికన్నా ఎక్కువగా అయిష్టపడే అంశం' అని ప్రవక్త పేర్కొన్నారు. అందుకే నేననుకుంటాను ఈ బలమైన సంప్రదాయం వల్లనే ఎంతో అరుదుగా ముస్లిం కుటుంబాల్లో విడాకులు చోటుచేసుకుంటాయి.

## మహిళల హోదా

నాలుగో అంశంగా నేను ఇస్లాంలో మహిళల హోదా గురించి కొన్ని మాటలు చెప్పదలచుకున్నాను. ఖుర్‌ఆన్‌లో మనకు ఇలా కన్పిస్తుంది...

**'మగవారికి మహిళలపై ఉన్నటువంటి హక్కులే ధర్మం ప్రకారం మహిళలకు కూడా మగవారిపై ఉన్నాయి'**

***(దివ్యఖుర్‌ఆన్ 2: 228)***

ఇస్లామ్ ధర్మనియమాలలో తప్పు పట్టాలనుకునేవారు ఇది మహిళల గౌరవానికి అవరోధంగా భావిస్తారు. కానీ నా అభిప్రాయంలో మాత్రం ఈ ఒక్క వాక్యంలోనే మహిళగా నా సంతోషానికి అవసరమైనవన్నీ లభిస్తాయి. నేను కోరుకునే అన్ని హక్కులు అది ఇస్తుంది. చదువుకునే హక్కు, ఆస్తిని కలిగివుండే హక్కు, ఇంట్లో సంరక్షకురాలిగా ఉండే హక్కు, అవసరాన్ని, పరిస్థితిని బట్టి ఉద్యోగం చేసే హక్కు లాంటివన్నీ అందులో ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే అన్నిటికన్నా ముఖ్యంగా నా భర్తమీద ఆధారపడే హక్కును నాకు ఇస్తుంది. అది జీవనాధారం కోసం కావచ్చు... కుటుంబం కోసం తీసుకునే నిర్ణయాల విషయంలో కావచ్చు. కుటుంబం పట్ల శ్రద్ధ తీసుకోవాల్సిన బాధ్యత పురుషుడి మీద ఉంటుంది. భార్యని సంప్రదించి, తన విచక్షణను ఉపయోగించి కుటుంబానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం అతని బాధ్యతే. ఇలా సొంత, సరైన నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యం గల, శక్తిమంతుడైన, తెలివైన,

రుజువర్తనుడైన భర్త కావాలనే కదా ఏ భార్య అయినా సహజంగా కోరుకునేది? నేననుకోవడం ఆదర్శవంతమైన కుటుంబ జీవితంగా ఇస్లాం దీనినే పరిగణి స్తోంది. ఇలాంటి వాతావరణంలోనే భార్యాభర్తలు దాంపత్య జీవితానికి సంబంధించిన ఆనందాలన్నీ అనుభవించగలుగుతారు.

## 3. కుటుంబం- వ్యక్తిత్వ నిర్మాణం

మానవీయ విలువలైన ప్రేమ, దయలాంటి వాటికి సంబంధించిన మూడోస్తంభం విషయానికి వస్తే నాకు కావలసినది నా తరఫున ఖుర్‌ఆనే చెప్తోంది.

**'మేము మానవునికి, అతను తన తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మెలగాలని ఉపదేశించాము. అతని తల్లి అతనిని ఎంతో శ్రమతో తన గర్భంలో పెట్టుకొని మోసింది; ఎంతో శ్రమతోనే అతనిని కన్నది. అతనిని గర్భంలో పెట్టుకొని మోసేందుకు, అతనిచే పాలు మాన్పించేందుకు ముప్పై మాసాలు పట్టింది. చివరికి అతను పరిపూర్ణ శక్తిని పొంది, నలభై సంవత్సరాల వయస్సుకు చేరినప్పుడు, ఇలా అన్నాడు, 'నా ప్రభూ! నాకూ, నా తల్లిదండ్రులకూ నీవు ప్రసాదించిన మహాభాగ్యాలకు గాను, నీకు కృతజ్ఞతలు తెలిపే, నీవు ఇష్టపడే సత్కార్యాలు చేసే సద్బుద్ధిని నాకు ప్రసాదించు.'** ***(దివ్యఖుర్‌ఆన్ 46: 15)***

ఖుర్‌ఆన్‌లో ఇంకా ఇలా ఉంది :

**'నీ ప్రభువు ఇలా నిర్ణయం చేశాడు : మీరు కేవలం ఆయనను తప్ప మరెవరినీ ఆరాధించకండి. తల్లిదండ్రులతో మంచితనంతో వ్యవహ రించండి. ఒకవేళ మీవద్ద వారిలో ఒకరు గాని ఇద్దరు గాని ముసలివారై ఉంటే, వారి ముందు విసుగ్గా 'ఛీ' అని కూడా అనకండి. వారిని కసరు**

**కుంటూ సమాధానం ఇవ్వకండి. వారితో మర్యాదగా మాట్లాడండి. మృదుత్వమూ, దయా భావమూ కలిగి వారి ముందు వినమ్రులై ఉండండి. ఇలా ప్రార్థిస్తూ ఉండండి : "ప్రభూ! వారిపై కరుణ జూపు, బాల్యంలో వారు నన్ను కారుణ్యంతో, వాత్సల్యంతో పోషించినట్లు"**

***(దివ్యఖుర్‌ఆన్ 17: 23, 24)***

పిల్లల పట్ల, పెద్దల పట్ల... ఎప్పుడైతే దయ, సంరక్షణ అవసరమో అప్పుడే అవి అందేలా ఏర్పాటు. మనం మంచివారుగా, సహనంతో, అవగాహనతో, కుటుంబంపట్ల ప్రోత్సాహకరంగా ఉంటే, వారిలోనూ అవే విలువలను పెంచి పోషిస్తే, మానవ సమాజంలోనూ ఆ విలువలను ముందుకు తీసుకెళ్లిన వాళ్లమవుతాం. కుటుంబ సభ్యులపట్ల సున్నిత హృదయంతో, జాగ్రత్త కలిగిన కుటుంబ పెద్ద లేదా తండ్రిగా ఎలా ఉంటాడో ఇంటి బయట ఇతరులతోనూ అలాగే మెలగుతాడు. కుటుంబ సభ్యులనైనా, సమాజంలోని తోటి వ్యక్తులనైనా ఈ విలువలను హరింపచేసే శత్రువులనుంచి తాను రక్షించాల్సి వస్తే కూడా అదే రీతిలో ఏమాత్రం రాజీపడకుండా కఠినంగా వ్యవహరించగలడు.

## 4. కుటుంబం ఒక ఆశ్రయం

చర్చను ముగించే ముందు నాలుగో స్తంభం గురించి తెలుసుకుందాం. కుటుంబం లోపల నుంచి, బయటనుంచి ఎదురయ్యే పలు కష్టాలనుంచి కాపాడే సురక్షితమైన శరణాలయం మనకు కుటుంబమే. ప్రజలు ఒకరినొకరు నమ్మే పరిస్థితి లేని ఈ రోజుల్లో... ఎవరికి వారు తమ గురించి తప్ప మరొకరి గురించి పట్టించుకోని స్వార్థపూరిత మనుషుల మధ్య, ఇతరుల సమస్యల గురించి పట్టించుకోవడం నేరంగా భావించే నేటి సమాజంలో... తమకోసం ఒక చోటు ఉందని తెలిసినవారే క్షేమంగా సంతోషంగా ఉంటారు. ఆ చోటుకి

వెళ్తే ఒక మంచి సలహానో, ఒక రొట్టె ముక్కో దొరుకుతుంది. ఊతమిచ్చే ఓ చేయో, నిద్రించను ఓ మంచమో దొరుకుతుంది. బయటి ప్రపంచం నుంచి మనకు రక్షణ దొరుకుతుందన్న గ్యారంటీ లభిస్తుంది. కుటుంబంలోని ఇతర సభ్యులు మననుంచి, మనకోసం మంచినే ఆశిస్తుంటారని మనకి తెలుసు. మనలో నిద్రాణంగా ఉన్న మంచి లక్షణాలు బహిర్గతపడేలా తోడ్పడేది మన కుటుంబమే. ఈ విధంగా సహాయం అవసరమైనవారికి, సహాయం చేయగలవారికి కూడా కుటుంబమే అద్భుతమైన వ్యవస్థ. కుటుంబంలాగా ఇతర ఏ సామాజిక వ్యవస్థా ఇలాంటి బాధ్యతలను విజయవంతంగా నెరవేర్చలేదు.

## చర్చ

ఇప్పటివరకు మనం చదివిన ఈ రెండు ఉపన్యాసాల అనంతరం ఒక చర్చ చోటుచేసుకుంది. ప్రధానంగా మొదటి ఉపన్యాసంపై పలు అంశాలు లేవనెత్తారు. కొద్దిగా కుదించిన ఆ చర్చను ఇక్కడ చూద్దాం.

## బహుభర్తృత్వం

ప్రశ్న: బహుభార్యాత్వం గురించి నేనో ప్రశ్న అడగాలనుకుంటున్నాను. ఒక పురుషుడు సందర్భాన్ని బట్టి అవసరమనిపిస్తే ఒకరికన్నా ఎక్కువ మంది భార్యలను కలిగివుండడం తప్పుకాదన్నారు కదా... అదే వాదన మహిళకూ వర్తిస్తుందా? వివరంగా చెప్పాలంటే మహిళ సంతానం పొందలేకపోతే ఆ భర్త మరో పెళ్లి చేసుకోవడానికి అనుమతి లభిస్తుంది, అదే పద్ధతిలో పురుషుడు సంతానోత్పత్తికి పనికి రాకపోతే ఆ భార్యకు రెండో భర్తను పొందే అనుమతి లభిస్తుందా?

ఆయిషా లేము సమాధానం: ఈ అంశంపై నేను పేర్కొన్న ఉదాహర

ణలు మనిషి జీవితంలో ఎదురయ్యే కొన్ని వాస్తవిక సమస్యలు, సందర్భాలు. ఇలాంటి సందర్భాలకు పాశ్చాత్య సమాజంలో పరిష్కారమార్గాలు చాలా పరిమితం. సమస్యతో కలిసి బతకడం లేదంటే విడాకులు తీసుకోవడం, అంతేకానీ మూడో ప్రత్యామ్నాయమైన మరో భార్యను తీసుకురావడం ఉండదు. అయితే ఒక మహిళ ఒకరి కన్నా ఎక్కువ మంది భర్తలను కలిగివుండడ మనేది పలు ఇతర సమస్యలకు కారణమవుతుంది. వాటిల్లో ఒకటి వారసత్వ సమస్య. ఒక మహిళకు ఒకరికన్నా ఎక్కువ మంది భర్తలుంటే ఆమె బిడ్డకు తండ్రి ఎవరన్న ప్రశ్న తలెత్తుతుంది. నా అభిప్రాయం ప్రకారం ఇది పురుషులను చాలా ఇబ్బంది పెడుతుంది. తమ బిడ్డ అవునో కాదో నిశ్చయంగా తెలియని పరిస్థితి వారిని ఇబ్బంది పెడుతుంది. ఇక్కడ చూడాల్సిన మరో సమస్య ఏమిటంటే మామూలు మాటల్లో చెప్పాలంటే ఒక భర్తను చూసుకోవడమే స్త్రీకి చాలినంత పని... ఒకరి కన్నా ఎక్కువ భర్తలు అంటే కోరి కష్టాలు తెచ్చుకోవడమే(బిగ్గరగా నవ్వులు.. చప్పట్లు). కాబట్టి అలాంటి సందర్భం వస్తుందనుకోను. అలాగే నాకు తెలిసినంతవరకు ఇస్లామ్ చట్టంలో అది జరిగే అవకాశం లేదు. అయితే ఇది చర్చ కాబట్టి, నాకన్నా ఎక్కువ సమాచారం తెలిసిన మేధావులు ఇక్కడ ఉండే అవకాశం ఉంది కాబట్టి వారు దీనిగురించి ఆలోచించవచ్చు.

**ఖుర్షీద్ అహ్మద్ :** సోదరి ఆయిషా చెప్పినదానికి ఒకటి రెండు మాటలు నేను చేర్చాలనుకుంటున్నాను. ముందుగా మనం ఇస్లామ్‌ను అర్థం చేసుకుందాం. ఇస్లాం కొన్ని సందర్భాల్లో బహుభార్యాత్వాన్ని అనుమతిస్తుంది కానీ ఎట్టి సందర్భంలోనూ బహుభర్తృత్వాన్ని అనుమతించదు. ఇది చట్టపరమైన పరిస్థితి. ఎందుకిలా అన్న ప్రశ్న తలెత్తుతుంది. సోదరి ఆయిషా రెండు పాయింట్లు చెప్పారు. ఒక్క భర్తనే భరించగలగడం అన్నదొకటైతే పితృత్వాన్ని,

తద్వారా వారసత్వాన్ని నిరూపించడమెలా అన్నది రెండోది. ఇక్కడ మరి కొన్ని కోణాలపైకి మీ దృష్టిని మళ్లించాలనుకుంటున్నాను.

మొదటగా, సామాజిక శాస్త్ర కోణం నుంచి చూస్తే పితృస్వామ్య సమాజంలో కుటుంబ వ్యవస్థ బహుభార్యాత్వంతో తేలిగ్గా ముందుకు సాగుతుంది కానీ బహు భర్తృత్వంతో సాగలేదు. కుటుంబ వ్యవస్థే బలహీనమై అదృశ్యమవుతుంది. వాదన నిమిత్తం చెప్పాలంటే మాతృస్వామ్య వ్యవస్థలో బహుభర్తృత్వం సాధ్యమవుతుంది. అప్పుడు పూర్తిగా సమాజ నిర్మాణంలో మార్పు చోటుచేసుకోవాల్సి ఉంటుంది.

రెండోది, సమాజం–లైంగికత పరంగా చూస్తే పురుషుడు ఎంతమంది భార్యలు ఉన్నా వారితో లైంగిక సంబంధం కొనసాగించగలడు. అంగరినీ సంతానవతులను చేయగలడు. కానీ స్త్రీకి ఎంతమంది భర్తలు ఉన్నా ఆమె ఒకసారి ఒక భర్తతోనే బిడ్డను కనగలుగుతుంది.

ఇంకో విషయం కూడా దృష్టిలో పెట్టుకోవాలి. మహిళ ఒకసారి గర్భం ధరిస్తే ఇక కొంతకాలం పాటు ఆమె లైంగిక కార్యానికి అందుబాటులో ఉండదు. ఈ నేపథ్యంలో కొందరు సెక్సాలజిస్టులు (చూడండి : లుడోవిసి, ఆంథోనీ ఎం., వుమన్: ఎ విండికేషన్, కాన్‌స్టేబుల్, లండన్; మరియు మ్యాక్ ఫార్లేన్, జె.ఇ.క్లేర్, ద కేస్ ఫర్ పాలిగామి) బహుభార్యాత్వానికి మద్దతిస్తూ ఓ వాదన చేశారు. అదేంటంటే గర్భం దాల్చి బిడ్డను కనే సమయంలో ఆ భార్యతో లైంగిక సంబంధం సాధ్యం కాదు కాబట్టి బలవంతపు ఏకపత్నిత్వం అనేది అసహజం అని వారు వాదించారు. వివాహ సంబంధంతో చట్టపరంగా రెండో భార్యను కలిగివుండే అవకాశం ఎప్పుడైతే నిషిద్ధమవుతుందో అప్పుడు అక్రమ సంబంధాలు పెరుగుతాయి. ఒక పురుషుడు, ఒక స్త్రీ అన్నప్పుడే పరిస్థితి ఇలా

ఉంటే ఇక ఒక స్త్రీకి ఒకరికన్నా ఎక్కువ మంది పురుషులు అన్నప్పుడు పరిస్థితి ఎలా ఉంటుంది?

మూడోది, ఫిజియో సెక్సోలాజికల్ కోణం నుంచి చూసినా ఈ ఏర్పాటు అసాధారణం. ఒక్క కోణం చూద్దాం. ఒక మహిళ– ఒక పురుషుడు అన్నప్పుడు లైంగిక వ్యాధులు వ్యాపించవు. పురుషుడు ఒకరికన్నా ఎక్కువ మంది స్త్రీలతో లైంగిక సంబంధం పెట్టుకున్నా, ఆ స్త్రీలు మరో పురుషుడి వద్దకు వెళ్లనంత కాలం లైంగిక వ్యాధులు వ్యాపించవు. అదే స్త్రీ ఒకరికన్నా ఎక్కువ మంది పురుషులతో లైంగిక సంబంధం కలిగివుంటే లైంగిక వ్యాధులు వ్యాపిస్తాయి.

ఇస్లాం బహుభర్తృత్వాన్ని కాదని, బహుభార్యాత్వాన్ని మాత్రమే సమర్థించడానికి పురుషుల పట్ల పక్షపాతం కారణం కానే కాదు. స్త్రీపురుషులిద్దరి మంచి కోసం. మొత్తంగా మానవ సమాజం మంచి కోసం.

## వారసత్వం

ప్రశ్న: ఇది చాలా వ్యక్తిగతమైన సమస్య. నాకు ఇద్దరు కుమార్తెలున్నారు. నా తప్పు లేకపోయినా, మగపిల్లవాడిని కనలేకపోయినందుకు నేను మరణించాక నా ఆస్తిని నా భర్త, నా ఇద్దరు పిల్లలు, నా సోదరులు, అక్కా చెల్లెళ్లు(నా తల్లిదండ్రులు లేని సందర్భంలో) అందరూ పంచుకుంటారు. నా బిడ్డల్లో ఒకరు మగబిడ్డ అయితే నా ఆస్తిలో నా సోదరులకు భాగం ఉండదు. ఈ విధానం నా పిల్లలకు శిక్షగా నేను భావిస్తున్నాను. ఎందుకిలా? మగపిల్ల వాడు పుట్టడం, పుట్టకపోవడం అనేది నా ఇష్టప్రకారమో, నా బిడ్డల ఇష్ట ప్రకారమో జరగదు కదా. అటువంటప్పుడు అది వారికి శిక్షే కదా?

ఆయిషాలేము సమాధానం: నేను నా ప్రసంగంలో పేర్కొన్న కేసు

లాంటిదే ఇది. మనం ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఇస్లామ్‌ని ఒక భాగంగా, ఒక సందర్భానికి విడిగా కాకుండా ఒక సమగ్ర విధానంగా మనం చూడాలి. గతంలో మనం అనుకున్నట్లుగా ఇస్లాంలో మహిళ సంరక్షణ బాధ్యత పురుషుడిదే. ఆమె అతని తల్లి కావచ్చు, భార్య కావచ్చు, కుమార్తె కావచ్చు. ఇవేమీ కాని బంధువర్గపు స్త్రీ కావచ్చు. ఆమెను పోషించే మరో పురుషులెవరూ సమీప బంధువర్గంలో లేకపోతే ఆ తర్వాత ఉన్నవారిదే ఆ బాధ్యత. పైగా ఆ పురుషుడి వయసుని బట్టి బాధ్యతా పెరుగుతుంది. అందుకనే, వారసత్వపు ఆస్తిలో అధిక భాగం కూడా పురుషునికే చెందడం న్యాయమని ఇస్లాం భావిస్తుంది. మొత్తం సమాజంగా కాక ఒంటరి సందర్భాలను తీసుకుని చూస్తే అన్యాయమనిపిస్తుంది. స్త్రీలు పురుషుల మీద ఆధారపడకుండా వాళ్ల బాగోగులు వాళ్లే చూసుకుంటే, పురుషులతో సమానంగా బాధ్యతలు స్వీకరిస్తే అప్పుడిది అన్యాయమే అన్పిస్తుంది. కానీ ఇస్లామిక్ న్యాయవ్యవస్థలో ఆమె బాధ్యత పురుషులదైనప్పుడు నా దృష్టిలో ఇది అన్యాయమనిపించదు. నేను చెప్పిన కోణంలో న్యాయనిపుణులు ఎవరైనా మరింత వివరంగా చెప్పగలరేమో మరి.

## ఖుర్షిద్ అహ్మద్:

నేను మరోసారి కలగజేసుకుంటున్నాను. ఈ ప్రశ్న ఇస్లాంలో ఒక ప్రత్యేక అంశం వారసత్వ చట్టం గురించి లేవనెత్తినది. ఇస్లాంలో వారసత్వ చట్టమనేది చాలా సమతౌల్యంతో, ఎన్నో అంశాలను ఒకదానితో ఒకటి అనుబంధం చేసి రూపొందించినది, దీన్ని మొత్తంగా చూడాలే కానీ చిన్న చిన్న భాగాలుగా కాదు. ఇప్పుడు మీరు పేర్కొన్న ప్రత్యేక సమస్యనే తీసుకుంటే మీరు చెప్పింది నిజమే. మరణం తర్వాత మీ ఆస్తి మీ తోబుట్టువులకు కూడా

చెందుతుంది. చట్టం ఎప్పుడూ సాధారణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటుంది కానీ అసాధారణంగా ఎక్కడో ఓ చోట జరిగే పరిస్థితులను కాదు. అయితే ఇస్లామిక్ వ్యవస్థ అలాంటి అసాధారణ పరిస్థితులను కూడా పట్టించుకుంటుంది. మీరు పేర్కొన్న లాంటి పరిస్థితుల్లో ఆడపిల్లల్ని అన్యాయంగా వదిలేయడం ఏమీ జరగదు. వాళ్లను కుటుంబం సురక్షితంగా చూసుకుంటుంది. కుటుంబమంటే అమ్మానాన్నా మాత్రమే కాదిక్కడ, చాలా విస్తారమైన బంధుత్వాలుంటాయందులో. భార్య, భర్తల ఇరువురి తల్లిదండ్రుల కుటుంబాలు, తోబుట్టువులు... అందరూ ఈ కుటుంబం అన్న ఛత్రఛాయలోకి వస్తారు. ఏ ఒక్క కుటుంబ సభ్యులు లేకున్నా పిల్లల బాధ్యతలను అందరూ పట్టించుకుంటారు. ఇక్కడ మీరు ఇస్లామిక్ సంరక్షణ సిద్ధాంతాన్ని మర్చిపో కూడదు. తల్లికానీ తండ్రికానీ లేనప్పుడు పైన పేర్కొన్న ఈ విశాల కుటుంబం నుంచే ఎవరో ఒకరు ఆ అమ్మాయిలకు సంరక్షకులు అవుతారు. అందుకే వారసత్వపు ఆస్తిలో కూడా వారందరికి భాగం ఉంటుంది. అలాగే బాధ్యత విషయంలోనూ వారంతా సంసిద్ధంగా ఉంటారు. మీ ఆస్తినుంచి తోబుట్టువులు లేదా తల్లిదండ్రులు ఎవరైతే భాగం తీసుకుంటారో వారు అది పూర్తిగా వారికోసమే వాడుకోరు, మొత్తంగా కుటుంబం కోసం వాడతారు. ఈ పెద్దలంతా మీ పిల్లల్ని ఆర్థికంగా, నైతికంగా, సామాజికంగా సంరక్షించాలని ఇస్లామిక్ చట్టం గట్టిగా చెప్తుంది. ఈ పిల్లలు వారి రక్తమాంసాలు పంచుకు పుట్టిన పిల్లలతో సమానం. వారు నైతికంగా, చట్టపరంగా కూడా ఆ పిల్లల్ని చూసుకోవాల్సిందే. అందుకే వ్యవస్థ వారసత్వపు ఆస్తిలో వారి వాటా ప్రాధా న్యాన్ని గుర్తిస్తుంది. ముఖ్యంగా చెప్పాలంటే ఇస్లాం అంటే ఏవో కొన్ని చట్టాల సమాహారం కాదు. అది నైతిక ప్రవర్తనావళి. ఒక సామాజిక అవగాహన.

సంరక్షణ కల్పించే ఒక వ్యవస్థ. పరిస్థితి ఏమైనా సరే... కుటుంబం ఈ పాత్ర పోషిస్తుంది.

## ముఖాన్ని కప్పుకోవడం

ప్రశ్న: పదిమందిలో ఉన్నప్పుడు ఖుర్‌ఆన్ ప్రకారం స్త్రీ, పురుషులు తమ దృక్కులను కిందికి మళ్లించాలి. స్త్రీ పైనుంచి కిందివరకు దుస్తులతో తనని తాను కప్పుకొన్నప్పుడు పురుషుడు ఇలా చూపులను కిందికి మళ్లించుకోవడంలో అర్థం లేదు. దీన్ని బట్టి అర్థమయ్యేదేంటంటే స్త్రీలు ముఖాలను కప్పుకోనక్కర లేదు, అందుకే పురుషులు చూపులు మళ్లించుకోవాలి. ఖుర్‌ఆన్ స్త్రీ పురుషులిద్దరికీ చూపులను కిందికి దించుకోమని చెప్తోందంటే దాని అర్థం స్త్రీ ముసుగు ధరించిలేదని. ముసుగుతో పూర్తిగా కప్పుకొని ఉన్నప్పుడు చూపు మళ్ళించుకోవాల్సిన అవసరం రాదు కదా. ఇంకా నాకు తెలిసి హజ్ యాత్రకు వెళ్లినపుడు మహిళలు అసలు ముసుగు ధరించకూడదని భావిస్తున్నాను.

**ఆయిషా లేము:** సోదరి లేవనెత్తిన అంశాన్ని నేను ప్రశంసిస్తున్నాను. ఈ విషయంలో నా అభిప్రాయమేమిటో మీరు చూశారు. ఈ రెండు పాయింట్లనూ నేను అంగీకరిస్తున్నాను. మరో అభిప్రాయం కూడా కొంతమందికి ఉందని, అందుకు ఆధారాలున్నాయని వారు అభిప్రాయపడుతున్నట్లు నా ప్రసంగంలో పేర్కొన్నాను. వాళ్లు వాటిని చెప్పాలనుకుంటే చెప్పవచ్చు.

**ఖుర్షిద్ అహ్మద్:** ఆ మరో అభిప్రాయాన్ని సూటిగా చెప్తాను. స్త్రీపురుషులను ఖుర్‌ఆన్ తమ దృక్కులను కిందికి దించుకోమని సూచించిందంటే దాని అర్థం ముఖాలు వస్త్రంతో కప్పుకోకుండా ఉంచుకోవాలని అన్నది మన భావన అంతే. ఇది మనని వాదనలో ఎంతో దూరం తీసుకెళ్లదు. మీరు పవిత్రులుగా

లేనప్పుడు, లేదా అపవిత్రంగా ఉన్నప్పుడు సలాత్(ప్రార్థన) జోలికి వెళ్లవద్దని ఖురాన్ పేర్కొంటే... దానర్థం ప్రార్థన చేయనప్పుడు ఎంత అపవిత్రంగా ఉన్నా పర్వాలేదని కాదు కదా. ఒకరిని ఒకరు చూసుకోవడానికి పలు మార్గాలున్నాయి. దేహమంతా వస్త్రంతో కప్పుకొని వున్నా కవ్విస్తూ చూడవచ్చు. చూపు కిందికి దించుకోమని చెప్పినప్పుడు అది కేవలం ఒక చర్యగా కాక ఒక దృక్పథాన్ని (యాటిట్యూడ్), లేదా స్వభావాన్ని చాటుతుంది. అలాగే చూడడమంటే కేవలం ఎదుటి వ్యక్తి ముఖాన్నే కాదు, మొత్తంగా ఆకృతిని చూడడం. ముఖాన్ని కప్పుకోవాలన్న వాదన ఖుర్‌ఆన్‌లోని కొన్ని సోదాహరణలను బట్టి వచ్చినది. ఆ తర్వాత దానిని హదీసు మరింతగా అభివృద్ధి పరిచింది. ప్రవక్త బోధనల నేపథ్యంలో ఖుర్‌ఆన్‌ను అర్థం చేసుకోవాలన్నది ఇస్లాం సిద్ధాంతం. ఆ రెండిటినీ బట్టి చూసినప్పుడు మహిళలు బయటకు వెళ్లినప్పుడు వారి శరీరాలను సరిగ్గా కప్పుకోవాలి. శరీరం అంటే ముఖం కూడా అని అర్థం. చేతులు, పాదాలు లాంటివి మాత్రమే బయటకు కనపడవచ్చు. ఈ విషయంలో రెండు రకాల అభిప్రాయాలున్నాయని, రెండూ కూడా వాస్తవ ఆధారాలనుంచే జాగ్రత్తగా తీసుకొనబడ్డాయని గ్రహించాలి. ఈ రెండిటిలో ఎవరికి నచ్చింది వారు తీసుకోవచ్చు కానీ, రెండో అభిప్రాయాన్ని కూడా గౌరవించాలి. హజ్ గురించి పేర్కొన్న విషయం సందర్భోచితం కాదు. హజ్‌కి సంబంధించిన ఆదేశాలను ప్రత్యేక సందర్భంగా గుర్తించాలి. వాటిని సాధారణీకరించడం సబబు కాదు. ఇహ్రామ్‌లో పురుషులు తమ తలను కవర్ చేసుకోలేరు. ముజ్దలీఫాలో, మగ్రిబ్ ప్రార్థన నియమిత సమయంలో చేయనప్పుడు ఇషాతో కలిపి చేయవచ్చు. ఇవన్నీ ప్రత్యేక సందర్భాలను సూచిస్తాయి. వాటిని సాధారణీకరిస్తే ప్రమాదకరంగా మారతాయి.

## వస్త్రధారణ

**శ్రోతల్లో ఒక మహిళ పరిశీలన:** దుస్తుల గురించి నేను కొన్ని మాటలు చెప్పదలచుకున్నాను. శ్రీమతి లేము దీని గురించి చాలా తక్కువ చెప్పారు. మొదట... ఇక్కడ ప్రాధాన్యాల ప్రశ్న వస్తుంది. ఇస్లాం జీవితం పట్ల మన దృక్పథాన్ని మార్చాలనుకుంటుంది. స్త్రీ పురుషుల చూపులకు సంబంధించి ఈ అంశం కావాలని చెప్పిందే తప్ప యథాలాపంగా చెప్పింది కాదు. వస్త్రధారణ నియమాలపై ఖుర్‌ఆన్, హదీసులు మౌనంగా లేవు. స్త్రీలు, పురుషులు తమను తాము ఎలా దుస్తులతో పూర్తిగా కప్పుకోవాలో విడివిడిగా సూచనలు ఉన్నాయి. మహిళలు తమ ముఖాలను కప్పుకోవాలా వద్దా అనేది మొత్తం విధానంలో ఒక కోణం మాత్రమే. ఆ మొత్తం విధానాన్ని పూర్తిగా అనుసరించడం లేదు కాబట్టే మనకు ఇది కష్టమైన సమస్యగా మారింది. కొంతమంది పురుషులు ఇస్లామ్ నియమాల నుంచి తమను తాము దూరంగా ఉంచుకుని ఆధునికతను ఆచరిస్తున్నారు కానీ తమ మహిళలు మాత్రం పూర్తిగా శరీరాన్ని కప్పుకోవాలని ఆశిస్తారు. మగవాళ్లు గడ్డం పెంచుకోకపోతే ప్రశ్నించే అధికారం ఎవరికీ లేదు. ఇస్లామ్ ఇంజంక్షన్లను పురుషులు కొందరు గౌరవించరు. కానీ ఇస్లామిక్ సూచనలన్నీ స్త్రీపురుషులిద్దరికీ సమానంగా ఉన్నాయి. వాటిని ఇద్దరూ గౌరవించాలి, తాము ఎంతవరకు వాటిని ఆచరిస్తున్నామో తమ హృదయంలో పరిశీలించుకోవాలి.